

16న ప్రధాని మోదీ విశాఖ రాక



విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే శనివారం విశాఖలోని రైల్వే మైదానంలో నిర్వహించనున్న సభలో ప్రధాని పాల్గొంటారని స్థానిక బీజేపీ నాయకులు వెల్లడించారు. టీడీపీ, జనసేనతో బీజేపీ పొత్తు కుదరడంతో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొంటారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. మోదీ పర్యటనకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ రావాల్సి ఉంది.



మాధవధార వుడా కాలనీలో వైసీపీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న వలంటీర్‌ను నిలదీస్తున్న టీడీపీ నేత తాతినేని శ్రీనివాసరావు

వలంటీర్ల బెదిరింపులు

జగనన్నే మళ్లీ రావాలని బయోమెట్రిక్ వేయండి

- వైసీపీ ప్రభుత్వం రాకపోతే పథకాలు నిలిచిపోతాయి
- పథకాలపై సర్వే పేరిట ఇళ్లకు వెళ్లి హెచ్చరికలు
- వైసీపీ నేతల ఫొటోలతో ముద్రించిన క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు
- అడ్డుకున్న టీడీపీ నేతలు

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): "గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు తీసుకున్నారు. దీనికి సంబంధించి ఒక సర్వే కూడా చేస్తున్నా. ప్రభుత్వం ముద్రించిన పథకాల కరపత్రాలు తీసుకోవాలి. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలి. ఇందుకు సమ్మతి తెలుపుతూ బయోమెట్రిక్ వేయండి. లేకపోతే పథకాలు నిలిచిపోతాయి" ... నగరంలోని రైల్వే న్యూకాలనీలో ప్రజలకు ఓ వలంటీర్ చేస్తున్న హెచ్చరిక ఇది.

ఎన్నికల సంఘం ఆదేశాలను ప్రభుత్వ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వం వేరు, రాజకీయ పార్టీ వేరు అన్న విషయాన్ని మరిచిపోయారు. కొంతమంది ఉద్యోగులు ఈ రెండింటికి మధ్య వున్న గీతను చెరిపేశారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు కాని వలంటీర్లు.. తామే అత్యంత కీలకమంటూ ప్రజలను

... మిగతా 6వ పేజీలో



రైల్వేన్యూకాలనీలో ఒక అపార్టుమెంట్‌లో బయోమెట్రిక్ కోసం వచ్చిన వలంటీరు (గులాబీ రంగు చున్నీ వేసుకున్న యువతి), వివరణ ఇవ్వడానికి వచ్చిన సచివాలయ ఉద్యోగిని (ఎడమవైపు)



నిఘా నిద్రపోతోంది!

నగరంలో పెరుగుతున్న చోరీలు

- శివారు ప్రాంతాల్లో తరచూ దొంగతనాలు
- తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న చోరులు

కూడళ్లలో మూలకు చేరిన సీసీ కెమెరాలు

- రద్దీ ప్రాంతాలు, అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్లక్ష్యం
- దొంగలకు అవకాశంగా మారిన పరిస్థితి
- నేరం జరిగినా నిందితుల ఆచూకీని గుర్తించలేకపోతున్న పోలీసులు

చినముషిడివాడ పరదేశిమాంబ ఆలయం సమీపంలో చోరీ జరిగిన ఇల్లు (ఫైల్ ఫొటో)



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో చోరీలకు అడ్డుకట్టవేస్తామంటూ పోలీసు అధికారులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలో సాధ్యంకావడం లేదు. అధికారులు, సిబ్బంది కేటాయింపులు పెరుగుతున్నా చోరీలకు అడ్డుకట్టపడకపోవడం నేరపరిశోధనా విభాగం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. నిత్యం ఏదో ఒక చోట ఇళ్లలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. గత కొద్దిరోజులుగా వీటి సంఖ్య మరింతగా పెరుగుతుండడం నగరవాసులతో పాటు పోలీసులను కూడా ఆందోళన కలిగిస్తోంది. నగరంలో నిఘా లోపించడంతోపాటు సీసీ కెమెరాలు అవసరమైన సంఖ్యలో లేకపోవడమే దొంగలకు వరంగా మారుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

వరుసచోరీలు నగరవాసుల్లో అలజడి రేపుతున్నాయి. ఇంటికి తాళం వేసి ఉంటే చాలు అదను చూసి పట్టపగలే తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడుతున్నారు. తాజాగా చినముషిడివాడలోని ఒక కిరణా వ్యాపారి భార్య ఈనెల తొమ్మిదిన సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటికి తాళం వేసి భర్తకు సాయం చేసేందుకు దుకాణం వద్దకు వెళ్లి తిరిగి ఆరు గంటలకు ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తాళాలు విరగ్గొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూసేసరికి 20 తులాల బంగారం. 15 తులాల వెండితోపాటు రూ.52 వేలు నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



బీరువాను చిందరవందర చేసిన దృశ్యం (ఫైల్)

- ఈనెల ఎనిమిదిన రాత్రి వేపగుంట సమీపంలోని అప్పన్నపాలెంలో పక్కపక్కనే ఉన్న రెండిళ్లలో దొంగలు చొరబడి 13 తులాల బంగారం, 200 తులాలు వెండి వస్తువులు అపహరించుకుపోయారు.
- గతనెల 27న దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిరాణా దుకాణానికి నడిచివెళుతున్న మహిళ మెడలోని బంగారం ఆభరణాలను బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తెంచుకుని పరారయ్యారు. అదే రోజు సీబీఎం కాంపౌండ్‌లో కూడా ఒక మహిళ మెడలోని ఆభరణాలను తెంచుకుని పోయారు.
- గతనెల 25న పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోనే నాలుగు ఇళ్లలో

... మిగతా 6వ పేజీలో



అభిమానులకు అభివాదం చేస్తున్న హీరో అల్లు అర్జున్

నగరంలో అల్లు అర్జున్

గోపాలపట్నం, మార్చి 10: నగరంలో ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ సందడి చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో జరగనున్న సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. సోమవారం నుంచి జరిగే సినిమా చిత్రీకరణలో ఆయన పాల్గొంటారని సమాచారం.



పట్టాలు తప్పిన భవానిపట్న పాసింజర్ రైలు

- ఇంజన్‌తోపాటు పక్కకు ఒరిగిన రెండు బోగీలు

- 6వ పేజీలో

సర్క్యూట్‌హౌస్‌లో రాజకీయ ప్రెస్‌మీట్లకు చెక్

- మంత్రి అమర్‌నాథ్ సమావేశానికి నో చెప్పిన అధికారులు
- ఐదేళ్ల నుంచి వైసీపీ కార్యాలయంగా మార్చేసిన మంత్రులు, నేతలు
- ఎట్టకేలకు ఎన్నికల ముందు మేల్కొన్న యంత్రాంగం

సర్క్యూట్ హౌస్



విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గవర్నర్ బంగ్లా (సర్క్యూట్ హౌస్)ను వైసీపీ కార్యాలయంగా మార్చేశారన్న విమర్శలకు జిల్లా యంత్రాంగం ఆలస్యంగా స్పందించింది. మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండడంతో గవర్నర్ బంగ్లా (ప్రభుత్వ అతిథిగృహం) వేదికగా రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేయడానికి ఏర్పాటుచేసే విలేకరుల సమావేశాలకు అనుమతించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం సర్క్యూట్‌హౌస్ మేనేజర్‌ను ఆదేశించింది. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ పొత్తుపై శనివారం సాయంత్రం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సర్క్యూట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. అయితే ఇక్కడ (సర్క్యూట్‌హౌస్) రాజకీయపరమైన విమర్శలు చేయడానికి విలేకరుల సమావేశాలు నిర్వహించవద్దని జిల్లా యంత్రాంగం ఇచ్చిన ఆదేశాలను మేనేజర్, మంత్రికి చెప్పారు. దీంతో అమర్ బంగ్లా వెలుపల సమావేశం నిర్వహించారు.

ఆలస్యంగా మేలుకున్న యంత్రాంగం

నగరం నడిబొడ్డున వున్న సర్క్యూట్‌హౌస్‌ను ఐదేళ్ల నుంచి మంత్రులు, ఎంపీలు, అధికార పార్టీ నేతలు వైసీపీ కార్యాలయంగా

... మిగతా 6వ పేజీలో

కొత్త జిల్లాలకు ఎస్‌ఈలు ఏరి?

- మూడు జిల్లాలకు ఒకరే విద్యుత్ అధికారి
- భారమవుతున్న పనుల పర్యవేక్షణ
- జేఏసీ సమావేశంలో సర్కిల్స్ ఏర్పాటుకు మంత్రి అంగీకారం
- ఏళ్లు గడుస్తున్నా చర్యలపై మీనమేషాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి రెండేళ్లు కావస్తున్నా విద్యుత్ శాఖలో అధికారుల నియామకం చేపట్టలేదు. పనులన్నీ పాత జిల్లాల అధికారుల ఆధ్వర్యంలోనే చేపడుతున్నారు. అంతేకాదు పదోన్నతులు, కొత్త ఉద్యోగాల సృష్టి, సిబ్బంది నియామకం చేపట్టలేదు. గతంతో పోల్చుకుంటే విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. 24/7 సరఫరా ఇవ్వాల్సి ఉంది. సకాలంలో బిల్లుల జారీ, వసూలు కత్తిమీద సాముగా మారింది. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రాజెక్టులను కూడా ఇక్కడి డిస్కమ్ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంది. వ్యవసాయానికి విద్యుత్ మీటర్ల అమరిక, భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు, స్మార్ట్ మీటర్లు.. ఇలా అనేక అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది.

జిల్లా కేంద్రంగా సర్కిల్ ఏర్పాటుచేసి దానికి సూపరింటెండింగ్ ఇంజనీర్ (జిల్లా అధికారి), డివిజన్లు, డివిజనల్ ఇంజనీర్లు, సహాయక, జూనియర్ ఇంజనీర్లు, లైన్‌మెన్లు, ఇలా వందలాది మందిని నియమించాల్సి ఉంది. ఎక్కడ ఏ సమస్య వచ్చినా నిర్దేశించిన సమయం (కొన్ని గంటలు)లోనే పరిష్కరించాలి. అంతేకాదు దరఖాస్తు చేసిన మూడు రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఇటీవల కేంద్రం సూచించింది. వీటిని అమలు చేయాల్సింది కూడా క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లే. అయినప్పటికీ సర్కిల్స్ ఏర్పాటు కాక సమస్యలు ఎదురవుతున్నాయి.

రాష్ట్రంలో గతంలో 13 జిల్లాలుండగా రెండేళ్ల క్రితం ప్రభుత్వం అదనంగా మరో 13 జిల్లాలను ఏర్పాటు చేసింది. వాటికి కలెక్టర్, జేసీ, డీఆర్వో, ఆర్డీవోలను నియమించింది. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల ఇలా అన్ని శాఖలకు జిల్లా అధికారుల నియామక ప్రక్రియ సాగింది. కానీ విద్యుత్ శాఖకు సంబంధించి కొత్త సర్కిళ్లను ఏర్పాటు చేయలేదు. ఎస్‌ఈలను నియమించలేదు. ఈ వ్యవహారాలన్నీ స్థానిక విద్యుత్ పంపిణీ సంస్థలే చూసుకోవాలని తేల్చి చెప్పింది. కొన్నాళ్ల క్రితం ఏపీ ట్రాన్స్‌కో, పంపిణీ సంస్థల సీఎండీలతో నిర్వహించిన జాయింట్ కమిటీ సమావేశంలో కొత్త సర్కిళ్ల ఏర్పాటు, అధికారుల నియామకంపై సీఎండీలు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. దీనికి ఆ శాఖ మంత్రి కూడా ఆమోదం తెలిపారు. ఆ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థలు ఫైళ్లు సిద్ధం చేశాయి. అయితే ఆ తరువాత ఏం జరిగిందో... ఆమోదించిన మంత్రే తరువాత చూద్దామంటూ పక్కన పెట్టేశారు.



మరో మూడు సర్కిల్స్ అవసరం

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు ఉండగా పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పాడేరు (అల్లూరి సీతారామరాజు) జిల్లాలు కొత్తగా ఏర్పడ్డాయి. అంటే అదనంగా మూడు సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. పార్వతీపురం, అనకాపల్లి, పాడేరుల్లో ఆయా కార్యాలయాలు, ఎస్‌ఈలను నియమించి, సిబ్బందిని సమకూర్చాలి. కానీ రెండేళ్లుగా ఉమ్మడి

... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీలకు మొండిచేయి

సమ్మె కాలానికి అందని వేతనాలు

- మంత్రి మాట ఇచ్చినా అమలుకు నోచని వైనం
- ఫిబ్రవరి వేతనాలకూ ఎదురుచూపులే
- ఆరు నెలలుగా గ్యాస్, కూరగాయలు బిల్లులు పెండింగ్

విశాఖపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సమ్మె కాలానికి కూడా వేతనాలు చెల్లిస్తాం'

- 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేసిన అంగన్‌వాడీ అసోసియేషన్ నేతలతో మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఇచ్చిన హామీ.

హామీ ఇచ్చి 50 రోజులు పూర్తి కావస్తోంది. ఇప్పటివరకు సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను చెల్లించలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తున్నా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 770 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 1,500 మంది కార్యకర్తలు, ఆయాలు పనిచేస్తున్నారు. సమ్మె కాలానికి కార్యకర్తకు రూ.15,350, ఆయాకు రూ.9,340 చొప్పున చెల్లించాల్సి ఉంది. సాక్షాత్తూ మంత్రి హామీ ఇచ్చి వారాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడంతో అసోసియేషన్ నాయకులను సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. తక్షణం వేతనం జమయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో మంత్రులను కలిసేందుకు అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఫిబ్రవరి వేతనాలేవీ?

ఇదిలా ఉండగా మార్చి పదో తేదీ వచ్చినా ఫిబ్రవరి నెల వేతనాలు ఇప్పటివరకు సిబ్బందికి జమకాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయాకు రూ.7 వేలు, కార్యకర్తకు రూ.11,500 చొప్పున చెల్లించాల్సి ఉంది. సమ్మె కాలానికి సంబంధించిన బకాయిలు, ఫిబ్రవరి వేతనం కలిపి ఒక్కో ఆయాకు రూ.16,340, కార్యకర్తకు రూ.26,850 చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే బకాయిలు చెల్లించాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరతున్నారు.



సమ్మెలో భాగంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫొటో)

బిల్లులకూ మోక్షం లేదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్కడే భోజనం వండి,వడ్డిస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే కూరగాయలు, ఇతర వంట సామగ్రితో పాటు వంట గ్యాస్ కొనుగోలు చేస్తుంటారు. ఇందుకయ్యే ఖర్చుకు సంబంధించిన బిల్లులు సమర్పిస్తే ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే గత జూలై నుంచి నవంబరు వరకు, మళ్లీ ఫిబ్రవరి నెలకు సంబంధించిన బిల్లులన్నింటినీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్యను బట్టి ఒక్కో కేంద్రానికి నెలకు రూ.వెయ్యి రూ.2,500 వరకు ఖర్చవుతుంది. ఒక్కో కార్యకర్తకు ఆరు నెలలకు సంబంధించి రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు బిల్లులను చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా బిల్లులు పెట్టడం మినహా చెల్లింపులపై అధికారులు పెదవి విప్పడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

క్యాబ్ డ్రైవర్ సజీవ దహనం?

- పెట్రోల్ పోసి నిప్పంటించి ఉంటారని అనుమానం
- ఆత్మహత్యగా భావిస్తున్న పోలీసులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ఎండాడ-రుషికొండ రోడ్డులో సంఘటన

విశాఖపట్నం/ఎండాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ క్యాబ్ డ్రైవర్ మృతిచెందాడు. మృతదేహం కాలిపోయి ఉండడంతో ఎవరో పెట్రోల్ పోసి సజీవ దహనం చేసి ఉంటారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే మృతుడి కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాలు, ప్రాథమిక ఆధారాలను బట్టి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ సంఘటన ఎండాడ- రుషికొండ రోడ్డులో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఎండాడ-రుషికొండ రోడ్డులోని దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ సెంటర్ వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందడంతో ద్వారకా ఏసీపీ రాంబాబు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహన్ని ఎవరో పెట్రోల్‌పోసి సజీవ దహనం చేయడం లేదా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడడం జరిగి ఉంటుందని భావించారు. దీనిపై ఆరా తీయడంతో మృతుడు ఎంవీపీ కాలనీకి చెందిన క్యాబ్ డ్రైవర్ మోసుగంటి సుబ్రహ్మణ్యం(43)గా గుర్తించారు. బంధువుల సమాచారం తెలుసుకున్న పోలీసులు పాస్టర్‌గా పనిచేస్తున్న మృతుడి సోదరుడు ప్రకాశ్ ను విచారించారు. మృతుడు సుబ్రహ్మణ్యంకు 12 ఏళ్ల కిందట వివాహం జరిగిందని, ఓ కుమారుడు కూడా ఉన్నాడని ప్రకాశ్ వివరించాడు. రెండేళ్ల కిందట భార్యాభర్తలు విడిపోవడంతో కుమారుడు ఆమెతోనే ఉంటున్నాడని, చట్టపరంగా విడాకులు కూడా తీసుకున్నారని ఏసీపీ తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి సుబ్రహ్మణ్యం వాడుతున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా గతంలో పలుమార్లు చేతి మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ఫొటోలు ఉన్నాయన్నారు. అలాగే శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఏసుక్రీస్తు కీర్తనలతోపాటు మనఃశాంతి కావాలంటే ఏహోవా మార్గాన్ని అనుసరించాలని పేర్కొంటూ వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారని, వీటన్నింటిని బట్టి అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నామన్నారు. అయినప్పటికీ అనుమానాస్పద మృతిగానే కేసు నమోదుచేశామని, ఆరిలోవ సీఐ దర్యాప్తుచేస్తున్నారని ఏసీపీ వివరించారు.



సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)



సెయింట్ లూక్స్ కళాశాల ఎదుట సగం కాలిన మృతదేహం



సంఘటన జరిగిన ప్రాంతంలో ఏసీపీ రాంబాబు, అధికారులు

నేడు ఉత్తర టీడీపీ సమావేశం

అక్కయ్యపాలెం, మార్చి 10: విశాఖ ఉత్తర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడానికి ఈ సమావేశం ఏర్పాటుచేశారు. మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడుపల్లా శ్రీనివాసరావు, పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ ఈ సమావేశంలో పాల్గొంటారు.

జోన్-5 పరిధిలోని దుకాణాలకు వేలం రేపు

జ్ఞానాపురం, మార్చి10: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు లీజుకు ఈనెల 12వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోన్-5 కమిషనర్ ఆర్.జి. కృష్ణ ప్రకటనలో తెలిపారు. కంచరపాలెంలోని అశోక్‌నగర్, 60వ వార్డు గుల్లలపాలెం, 58వ వార్డు సంజీవయ్యకాలనీలోని ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలకు, అలానే మాధవదారలోని మాధవస్వామి కల్యాణమండపం, కంచరపాలెం నుంచి 104 ఏరియా వరకు రోడ్డు సైడ్ మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్డు సైడ్ మార్కెట్ లీజు ప్రాతిపాదికన కేటాయించేందుకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'ముస్లింలకు టికెట్ కేటాయించాలి'

మహారాణిపేట, మార్చి 10: ఉత్తరాంధ్రలో తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీలకు శాసనసభలో పోటీచేసే అవకాశం కల్పించాలని విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ ముస్లిం మైనారిటీ సంఘం కోరింది. ఆదివారం విలేకరులతో నాయకులు షేక్ రహ్మాతుల్లా, మహ్మద్‌గౌస్‌లు మాట్లాడుతూ, ముస్లిం ఆత్మగౌరవం కాపాడేందుకు అధిష్ఠానం ముందుకు రావాలని కోరారు. ప్రజల్లో గుర్తింపుఉన్న టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మహమ్మద్ నజీర్‌కు దక్షిణ నియోజక వర్గ టికెట్ కేటాయించాలని కోరారు. ఈమేరకు నజీర్‌పై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా సర్వే చేయించి మెజార్టీ అభిప్రాయం మేరకు సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మౌలిక వసతుల కల్పన

కంచరపాలెం, మార్చి 10: మౌలిక వసతుల కల్పనతో జీవీఎంసీ 48వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్టు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు పేర్కొన్నారు. ఆదివారం ఇందిరానగర్, బాపూజీ నగర్‌లో జరుగుతున్న రోడ్డు, కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 48వ వార్డు పూర్తిగా కొండపై ఉందన్నారు. కోట్లాది రూపాయాలుతో ఈ వార్డులో రోడ్డు, డ్రైన్లు, సామాజిక భవనాల నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. వార్డులో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులుతో మాట్లాడుతు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఊర్వశి జంక్షన్ నుంచి బర్మాక్యాంప్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్టు వివరించారు.

ముగిసిన దుర్గాలమ్మ ఉత్సవాలు

పూర్ణామార్కెట్, మార్చి 10: గ్రేటర్ 35వ వార్డు పరిధిలో దుర్గాలమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన అమ్మవారి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పూర్ణామార్కెట్ శ్రీవరసిద్ధి వినాయక వర్తక సంఘం ప్రతినిధి గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావును స్థానిక దుర్గాలమ్మ సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో యువతకు పూర్తి సహకారం అందించడంపై ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

మాతృభాషలో బోధనకు సమష్టి కృషి



మాట్లాడుతున్న రచయిత డీవీ సూర్యారావు

సీతంపేట, మార్చి 10: రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో కచ్చితంగా మాతృ భాష తెలుగుభాషలోనే కొనసాగేలా సమష్టిగా కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో తెలుగు దండు ఆధ్వర్యంలో ఆత్మీయ సమాలోచనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొని తెలుగుభాష పరిరక్షణకు పరవస్తు సూరి రాజకీయ అరంగేట్రానికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ మాతృభాష ప్రాధాన్యం కల్పించాలన్నారు. పరవస్తు సూరి మాట్లాడుతూ మాతృభాష రక్షణ కోసం పాలకుల మెడలు వంచి సాధించుకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చినట్టు చెప్పారు. అలాగే ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంటును నిలబెట్టుకునేందుకు పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలన్నారు. మన జాతి హక్కుల కోసం పోరాడి సాధిస్తానని ప్రతిజ్ఞ చేశారు. రాజకీయ విశ్లేషకులు కిరణ్‌కుమార్, డాక్టర్ ఆనంద్, రాజమన్నార్, భానుకుమార్, సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, శంకర్ నీలు, చిన సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోర్టు స్టేడియం ప్రైవేటీకరణ తగదు

▸▸ వార్వా అధ్యక్షుడు ప్రకాశరావు



ధర్నా చేస్తున్న వార్వా ప్రతినిధులు

అక్కయ్యపాలెం, మార్చి 10: నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు స్టేడియంను ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటీకరించడం తగదని వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. ప్రకాశరావు, బీబీ గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పోర్టు స్టేడియం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోర్టు స్టేడియం పోర్టు ట్రస్టుకి చెందిందని, అంటే అది ప్రజల ఆస్తి అన్నారు. అందువల్ల పోర్టు ట్రస్టే దీని నిర్వహణ బాధ్యత చూడాలన్నారు. కానీ, ప్రస్తుతం స్టేడియంను విశ్వనాథ్ అనే వ్యక్తికి కాంట్రాక్ట్‌కు ఇచ్చారన్నారు. దీంతో ఇంతవరకు స్టేడియంలో ఉచితం, లేదా నామ మాత్ర ఫీజులతో ఆడుకునే వీలుండేదన్నారు. విశ్వనాథ్ తీసుకున్న తర్వాత అన్ని విభాగా ల్లో డబ్బు వసూలుచేస్తున్నారన్నారు. స్టేడియంలో ఒక రోజంతా క్రికెట్ ఆడాలంటే రూ.36వేలు చెల్లించాల్సి వస్తుందని, దీని బట్టీ ఇతర ఫీజులు అంచనా వేసుకోవచ్చన్నారు. తక్కువ ఫీజుతో ప్రజలు హెల్త్ వాక్ చేస్తున్నారని, ఇకపై భారీ ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యంపై చూపుతుందున్నారు. పిల్లలు, యువకుల ఆటలకు విఘాతం కలిగిస్తోందని పేర్కొన్నారు. స్టేడియంలోని చెట్లు నరికివేసి కాంక్రీట్ జంగిల్ గా మార్చి భవనాలు నిర్మిస్తుండడంతో పర్యావరణానికి తీ వ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పోర్టు స్టేడియం ప్రైవేటీకరణ అన్ని విధాల నగరవాసులకు నష్టదాయకమని, ఈస్థితిలో ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నివాస్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి.లచ్చిరాజు, పిట్టా నారాయణ మూర్తి, అక్కయ్యపాలెం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, మురళీ రాజు, బీఎల్ నారాయణ, బి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంలో ఆదర్శ దంపతులు



పార్థివ దేహాలు దానం చేసిన దంపతులు

సీతమ్మధార, మార్చి 10: రెండేళ్ల కిందట భర్త పార్థీవ దేహం దానం చేశారు.. ఆయన అడుగుజాడల్లో భార్య అనుసరించి ఆదర్శంగా నిలిచారు. వివరాలివి.. సీతమ్మధారకి చెందిన కేవీ రమాదేవి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి అప్పగించారు. ఇదిలాఉండగా, ఆమె భర్త కేఆర్ఎస్ఎస్ శాస్త్రి 15 ఏళ్ల కిందట సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన భౌతిక కాయాన్ని దానం చేసేందుకు అంగీకరిస్తూ వీలురాశారు. జైలర్‌గా పనిచేసిన శాస్త్రి ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి, ఆయన పార్థీవ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అందజేశారు. భార్య రమాదేవి భర్త ఆశయాలకు అనుసరించారు. ఈమేరకు ఆదివారం ఆమె కోరిక మేరకు కళ్లను కేవీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి, పార్థివ దేహాన్ని సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగించారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం



హలీం సెంటర్ ప్రారంభోత్సవంలో సీతంరాజు

మహారాణిపేట, మార్చి 10: ఆధ్యాత్మికంగా రంజాన్ మాసం ఎంతో పవిత్రమని దక్షిణ నియోజక వర్గ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో మహారాణిపేటలోని మక్కా మసీదు సమీపంలో హైదరాబాద్ హలీం సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. రంజాన్ ఉపవాస దీక్ష అనంతరం ముస్లింలు స్వీకరించే హలీం సెంటర్‌ను ఏటా నిర్వహించడం మంచి సాంప్రదాయమన్నారు. ప్రపంచంలో సైన్సు అభివృద్ధి చెందని రోజుల్లోనేహలీంను సాయంత్రపు ఆహారంగా ఉపయోగించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు , 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్‌అలీ, 42 వవార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యలో మార్పు అవసరం

▸▸ అపూస్మా సమావేశంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి10 : యువతలో నైపుణ్యాలు పెరగాలంటే ప్రాథమిక విద్యా విధానంలో గణనీయమైన మార్పులు అవసరమని గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీభరత్ అన్నారు. ఆదివారం ఆయన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపూస్మా) రాష్ట్ర స్థాయి టీచర్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల స్థాయి దాటి కళాశాలలకు వచ్చే యువతలో అధిక శాతం మందికి భవిష్యత్తుపై సరైన దిశా నిర్దేశం ఉండడం లేదన్నారు. ప్రాథమిక స్థాయి విద్యా బోధనలో బలమైన పునాదులు వుంటే వారి జీవితంలో ఎదగడానికి కారణమవుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటు విద్యాలయాలు మారినప్పుడే మనుగడ సాధ్యమన్నారు. అధ్యాపకులు తమను తాము సాంకేతికంగా తీర్చిదిద్దుకోవాలని, ఇది ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య బోధించే వారి వరకు వర్తిస్తుందని చెప్పారు. ప్రాథమిక విద్యను బోధించే పాఠశాలలకు గీతం మార్గదర్శిగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపూస్మా రాష్ట్ర మార్గదర్శి ఎ. కృష్ణారెడ్డి, కోశాధికారి ఎంవీరావు, విశాఖ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణ, జి. శేషగిరిరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మార్చి 10: శ్రీ నందగిరి సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వ ర్యంలో 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు స్థానికులకు వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్ ఎండీ కె.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతినెలా పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు జనరల్ చెకప్‌లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సిబ్బంది సుజాత, కోటి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెం ఏడుగుళ్ల అమ్మవారి ఆలయం అప్పగించాలి

▸▸ గ్రామ కమిటీ డిమాండ్ ▸▸ గ్రామస్తుల నిరసన ర్యాలీ



ఏడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సీతమ్మధార, మార్చి 10: గ్రేటర్ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం వాసుల ఆరాధ్య దైవంగా ఉన్న ముత్యాలమ్మ ఏడుగుళ్ల అమ్మవారి ఆలయాన్ని తమకే అప్పగించాలని గ్రామ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం గ్రామ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన తెలిపారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దుంగి ప్రసాదరెడ్డి, దిలీప్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఈ ఆలయం తమ తాత, ముత్తాతల నుంచి వస్తుందన్నారు. రోజూ పూజలు, ఏటా పండుగలు చేస్తున్నామన్నారు. అయితే, ప్రస్తుతం స్థలాల ధర పెరగడంతో అక్కడే ఉన్న ఎరుసు నరసింగరావు కుటుంబ సభ్యులు ఆలయాన్ని ఆక్రమించి ఆ స్థలం తమదేనంటూ ఆలయాన్ని సొంతం చేసుకుని, భక్తులనుంచి డబ్బు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం వెనుక ఉన్న స్థలంలో బహుళ అంతస్తుల భవనాన్ని ప్రస్తుత 15వ వార్డు కార్పొరేటర్ భర్త గిరిబాబుకి చాలాకాలం క్రితం ఒప్పందం కుదుర్చుకుని నిర్మాణం ప్రారంభించారన్నారు. అయితే, దీనిపై గ్రామస్తులు కోర్టులో కేసు వేయడంతో ఈ నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఇప్పుడు గిరిబాబు తన భార్య అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ కావడంతో ఆలయానికి చెందిన స్థలంలో రోడ్డు వేసి జీవీఎంసీ నిర్మించిన డివైడర్‌ను తొలగించి రాత్రికి రాత్రే రోడ్డు నిర్మాణం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి చెందిన స్థలంలో రహదారి నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బర్ల బాలకృష్ణ, మజ్జి ఉమామహేశ్వర రావు, నక్క రమేష్ రెడ్డి, బోర శ్రీనివాస రెడ్డి, చుక్క శ్రీనివాసరెడ్డి, పిడింట్ల రమేష్, గుడ్ల కాటారాజు రెడ్డి, ఎరుసు మునింద్రరెడ్డిగ్రామకోర్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వనందునే ఆందోళన: ఆలయ ధర్మకర్త నరసింగరావు

తమ తాతలకు చెందిన ఏడుగుళ్ల ఆలయ స్థలం తమదేనని ఆలయ ధర్మకర్త ఎరుసు నరసింగరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్నాళ్ల కిందట గ్రామ కమిటీ ప్రతినిధులు అమ్మవారి ఆలయాన్ని గ్రామానికి అప్పగించాలని కేసు వేశారన్నారు. ఈ కేసు తాను గెలిచినట్టు చెప్పారు. తర్వాత దుంగి ప్రసాద్‌రెడ్డి, దుంగి దిలీప్, దుంగి రమేష్‌లు తమకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, లేకపోతే వివాదం సృష్టి స్తామని బెదిరించారన్నారు.ఈ నేపథ్యంలోనే ఆందోళన చేస్తున్నారన్నారు.

ఎర్నిమాంబ ఆలయ కమిటీకి అభినందన

జ్ఞానాపురం, మార్చి 10: నూతనంగా నియమితులైన స్థానిక ఎర్నిమాంబ ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీని 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబరు కోడిగుడ్ల పూర్ణిమ అభినందించారు. వార్డు కార్యాయంలో ఆమెను వారు ఆదివారం కలిశారు. అనంతరం సభ్యులు సోమవారం ట్రస్ట్ సభ్యులకు జరగనున్న సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సిందిగా కార్పొరేటర్‌ను ఆహ్వానించారు. ఆలయ ఈఓసురేశ్‌బాబా, కమిటీ చైర్మన్ లండారమణ, సభ్యులు చుక్కా శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ సెంటర్స్‌తో ఆత్మీయ సమావేశం

అక్కయ్యపాలెం, మార్చి 10: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఉత్తర నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కేకే రాజుకు మద్దతుగా షాదీఖానా కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జీవీ రవిరాజు ఆధ్వర్యంలో బాక్సింగ్ సెంటర్స్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డి.రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ దేవ్, కె.నూకరాజు తదితరులు పాల్నోరు.

మురళీనగర్; రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.రాజు క్షత్రియ సామాజిక వర్గ ప్రతినిధులను కోరారు. 50వవార్డులో పలు కాలనీల క్ష త్రియ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 10 : నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం, ఆంధ్రజ్యోతి ఏరియా, సంతోషిమాత కాలనీ, వైఎస్సార్ కాలనీ, టిడ్కో కాలనీల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పట్టాలు తప్పిన భవానిపట్న పాసింజర్ రైలు

▸▸ ఇంజన్‌తోపాటు పక్కకు ఒరిగిన రెండు బోగీలు

విశాఖపట్నం, మార్చి 10: విశాఖ నుంచి ఒడిశాలోని భవానీపట్న వెళ్తున్న ప్రత్యేకపాసింజర్ రైలు (08504) విజయనగరం జిల్లా కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు విశాఖ నుంచి బయలుదేరిన ఈ రైలు 7.00 గంటల సమయంలో కొత్తవలస రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుండగా లోకో (ఇంజన్), ఒక జనరల్ కోచ్, ఎస్ఎల్ఆర్ కోచ్‌లు పట్టాలు తప్పాయి. బోగీలు ఒకవైపునకు కొద్దిగా ఒరగడంతో ప్రయాణికులు భయాందోళనచెందారు. బోగీలు పక్కకు పడకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదిక పునరుద్ధరణ పనులు చేపట్టారు. సుమారు గంటన్నర తరువాత రైలు తిరిగి బయలుదేరింది. ఈ సంఘటనతో ఇతర రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయంలేదు.

ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

▸▸ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

డాబాగార్డెన్స్, మార్చి 10: ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ, ఇతర గిరిజన సమస్యలపై ఆదివారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ దరి అంబేద్కర్ విగ్రహం ఎదుట మన్యం బంద్‌కు మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు 100 శాతం తమకు ఇవ్వాలన్నారు. జీవో 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలన్నారు. రాష్ట్రంలో నాన్‌షెడ్యూల్డ్ 1500 గిరిజన గ్రామాలకు షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆదివాసీ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు, ఆయుధ కర్మాగార నిర్మాణం రద్దు చేయాలన్నారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఏపీ ప్రభుత్వ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఆదివాసీవాల్మీకి, కొండదొర తెగలను పునరుద్ధరించాలని కోరారు. సభ్యులు జోంజుబాబు, బొండా తౌడన్న, ఎం.గౌరీశంకర్, టి.శంకరరావు, కోటిబాబు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఆర్.సత్యారావు, రామన్న, రామారావు, గోపాల్, దిస్మన్‌కాంత్ పాల్గొన్నారు.

నిఘా నిద్రపోతోంది!

... 5వ పేజీ తరువాయి

వరుస చోరీలు జరిగాయి.

▸▸ నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి రైల్వేన్యూకాలనీలో ఉంటున్న విశ్రాంత పోస్టల్‌శాఖ ఉద్యోగి ఇంట్లో అతని కుమార్తె స్నేహితురాలైన సినీనటి సౌమ్య సుమారు 70తులాల బంగారాన్ని అపహరించుకుని పోయింది. ఆమెపై బాధితుడు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు తమదైనశైలిలో విచారించి కేసుని ఛేదించగలిగారు. అదే అనుమానం వ్యక్తంచేసి ఉండకపోతే నేరం ఎవరు చేశారనే దానిపై పోలీసులు ఇంతవరకూ ఒక అంచనాకు వచ్చే పరిస్థితి లేదు. నగరంలో గతనెలరోజులుగా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఇళ్లలో చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు జరుగుతూనే ఉండడం పోలీస్ వర్గాలను సైతం ఆందోళనకు గురిచేస్తోంది.

పోలీసులకు సవాల్ : రాష్ట్రంలో విశాఖ నగరానికి ప్రాధాన్యం పెరగడంతో సీపీగా ఐజీ ర్యాంక్ స్థాయి అధికారి నుంచి అదనపు డీజీపీ స్థాయి ర్యాంక్ అధికారిని నియమించారు. అంతేకాకుండా కొత్తగా జాయింట్ పోలీస్ కమిషనర్‌తోపాటు జోన్-2కి రెగ్యులర్ డీసీపీగా ఐపీఎస్ అధికారిని కేటాయించారు. క్రైమ్ విభాగానికి నాన్‌కేడర్ ఐపీఎస్ అధికారిని డీసీపీగా నియమించారు. సీసీఎస్‌కు, క్రైమ్‌కు వేర్వేరుగా ఇద్దరు ఏసీపీలను కేటాయించారు. సీఐలతోపాటు ఎస్‌ఐలను కూడా భారీగానే కేటాయించారు. నగరంలో బందోబస్తులు, ప్రముఖుల పర్యటనలు, సమావేశాల కారణంగా అదనపు సిబ్బంది అవసరమని అధికారులు చెబుతున్నా, గతంలో పోల్చితే కేటాయింపు భారీగానే పెరిగిందని అంగీకరిస్తున్నారు. అలాంటి పరిస్థితిలో నగరంలో నేరాలను కనీసస్థాయికి తగ్గించాల్సి ఉన్నప్పటికీ, దీనికి భిన్నంగా రోజురోజుకీ పెరుగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ పరిణామం పోలీస్ అధికారులకు సైతం సవాల్‌గానే మారిందనే చెప్పుకోవాలి. నేరాల నియంత్రణపై పోలీస్ అధికా రులు మాటలే తప్ప, ఆచరణలో చూపించకపోవడమే నేరాల పెరుగుదల కారణంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రాత్రి గస్తీ పక్కాగా జరిగేది. బీట్‌ల సంఖ్య కూడా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ గరిష్ట సంఖ్యలో నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం రాత్రి గస్తీ, బీట్‌ల నిర్వహణ తూతూమంత్రంగా మారిపోయింది. రాత్రిగస్తీ సిబ్బంది కొంతసేపు నగరంలో తిరిగి తర్వాత ఏదో ఒకసినిమా థియేటర్‌కు వెళ్లి సినిమా చూసుకుని గడిపేయడం, లేదంటే ఇంటికి వెళ్లి నిద్రపోయి తెల్లవారుజామున తిరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బీట్‌బుక్‌ను అందజేస్తున్నారని పోలీస్ సిబ్బందే చెబుతుండడం పరిస్థితికి అద్దంపడుతోంది.

అధ్వానంగా సీసీ కెమెరాలు: నగరంలో నేర నియంత్రణే లక్ష్యంగా పదేళ్ల కిందట ప్రజా భద్రత చట్టం కింద ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కు టార్గెట్లు విధించి రద్దీగా ఉండే ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, ఆలయాలు, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అపార్టుమెంట్ల అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటుచేసి సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలాచర్యలు తీసుకున్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా దాదాపు 580 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ప్రతి కూడలిలోనూ వీటిని ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడైనా చోరీ జరిగితే ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి అనుమానితులను గుర్తించేవారు.కానీప్రస్తుతంచాలావరకు సీసీకెమెరాలు మూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేయించే నాథుడే లేకుండా పోయారు. పోలీసులు కూడా నేరం జరిగిన సందర్భా సీసీ కెమెరాలపై హడావుడి చేసి తర్వాత వదిలేస్తున్నారు.

వలంటీర్ల బెదిరింపులు

... 5వ పేజీ తరువాయి

బెదిరిస్తున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి పేరిట ముద్రించిన రెండు పేజీల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో అన్ని వార్డు/గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికి ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీలోగా కరపత్రాలను పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా వలంటీర్ మొబైల్ యాప్‌లో ఈకేవైసీ (బయోమెట్రిక్) తీసుకోవాలని, ప్రభుత్వ పథకాల వల్ల సదరు కుటుంబానికి ఎంత మొత్తం అందింది? అన్నది సర్వే చేయాలని స్పష్టం చేశారు. అయితే వలంటీర్లు ఇంతవరకే పరిమితం కాకుండా వైసీపీకి మద్దతుగా ప్రజలపట్ల బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారు. జగనన్నే మళ్లీ సీఎంగా రావాలంటూ బయోమెట్రిక్ వేయండి, లేకపోతే పథకాలు ఆగిపోతాయి అని హెచ్చరిస్తున్నారు. ఆదివారం విశాఖలోని రైల్వేన్యూకాలనీలో ఒక అపార్టుమెంట్‌కు వలంటీర్ వెళ్లి కరపత్రాలు పంపిణీచేసి, జగనన్నే మళ్లీ సీఎంగా రావాలంటూ బయోమెట్రిక్ వేయాలని చెప్పడంతో వివాదం నెలకొంది. బయోమెట్రిక్ వేయాలని బలవంతం చేయడం ఏమిటని ఒక మహిళ గట్టిగా నిలదీశారు. అపార్టుమెంట్‌లోని ఇతర ఫ్లాట్లలో వుంటున్న వారు బయటకు వచ్చారు. దీంతో వలంటీరు అక్కడ నుంచి బయటకువెళ్లి సచివాలయ ఉద్యోగికి సమాచారం ఇచ్చారు. సదరు ఉద్యోగి వచ్చి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. జగన్ మళ్లీ రావాలని తాము చెప్పమనలేదని, ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేసే కరపత్రాలను మాత్రమే పంపిణీ చేయాలని చెప్పామన్నారు.

వైసీపీ నేతల క్యాలండర్లను పంపిణీ చేసిన వలంటీర్

విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు ఫొటోతో ముద్రించిన క్యాలండర్లను ఆదివారం మాధవధారలో వలంటీర్ పంపిణీ చేయడం వివాదమైంది. స్థానిక టీడీపీ నాయకులు తాతినేని శ్రీనివాసరావు, మరికొందరు అడ్డుకుని అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వ సొమ్మును గౌరవ వేతనంగా తీసుకుంటూ.. వైసీపీ నాయకుల ఫొటోలతో ముద్రించిన క్యాలండర్లను ఎలా పంపిణీ చేస్తావంటూ నిలదీశారు. దీంతో వలంటీర్ అక్కడ నుంచి జారుకున్నాడు.

ప్రతి ఇంటికి సీఎం కరపత్రం అందించాల్సిందే

వలంటీర్లకు సచివాలయ కార్యదర్శి హుకుం

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఆదివారం సాయంత్రంలోగా ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి ఒకరు వలంటీర్లను హెచ్చరిస్తూ పెట్టిన వాయిస్ మేసేజ్ విశాఖ నగరంలో హల్‌చల్ చేస్తోంది. ముఖ్యమంత్రి పేరిట ఉన్న కరపత్రాల పంపిణీ శతశాతం పూర్తికావాలని, ఒకవేళ కాకపోతే అందుకు గల కారణాలను చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని బెదిరించారు. కరపత్రాలు పంపిణీ సమయంలో ప్రతి ఇంట్లో ఒకరి నుంచి ఈకేవైసీ చేయించాలని, ఇందుకు సర్వర్ స్పీడ్‌గాఉందని చెప్పడం గమనార్హం. ఒకవేళ ఆదివారం సాయంత్రానికి కరపత్రాల పంపిణీ, ఈకేవైసీ చేయని వలంటీర్లంతా సోమవారంఉదయంజోనల్ కమిషనర్ కార్యాలయానికి హాజరుకావాలని ఆదేశించారు.

కొత్త జిల్లాలకు ఎస్ఈలు ఏరి?

... 5వ పేజీ తరువాయి

విశాఖ జిల్లా ఎస్ఈతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను నడిపిస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో స్పందన కార్యక్రమం జరుగుతుంది. విద్యుత్ శాఖ సమస్యలపై చర్చించేందుకు ఎస్ఈ ఉండాలి. మూడు జిల్లాలకు కలిపి ఒకరే ఎస్ఈ ఉండడంతో ఒక్కచోట మాత్రమే హాజరుకాగలుగుతున్నారు. స్మార్ట్‌సిటీగా విశాఖకు, వందలాది పరిశ్రమలున్న జిల్లాగా అనకాపల్లికి, ఏజెన్సీ కేంద్రంగా అల్లూరి జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక్కరే ఎస్ఈతో పని విభజనకు అవకాశం లభించడం లేదు. విశాఖలో జిల్లా పరిషత్ సమావేశాలు నిర్వహించినప్పుడు అనకాపల్లి, అల్లూరి జిల్లా ప్రజాప్రతినిధులు దీనిపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకువెళుతున్నా ఫలితం కనిపించడం లేదు,

ఏళ్లుగా పదోన్నతులూ లేవు

ఈపీడీసీఎల్‌లో ఇంజనీర్లకు ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించడం లేదు. అసిస్టెంట్ ఇంజనీర్ ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నా డివిజనల్ ఇంజనీర్ కాలేకపోతున్నారు. కొత్త జిల్లాల్లో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే సీనియర్ డీఈలకు ఎస్ఈలుగా, మిగిలిన వారికి ఇతర హోదాల్లో పదోన్నతులు లభిస్తాయి. ఆయా కార్యాలయాలకు అవసరమైన సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్ల అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నాయి.

సర్క్యూట్‌హౌస్‌లో రాజకీయ ప్రెస్‌మీట్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

మార్చేశారు. గతంలో ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా వున్న ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రస్తుత ఇన్ చార్జి వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఇతర నేతలుగవర్నర్ బంగ్లా వేదికగా విపక్షాలపై దుమ్మె త్తిపోస్తూ వస్తున్నారు. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జులు గా ఉన్న నేతల వెంట వచ్చే కిందిస్థాయి నాయ కులు గవర్నర్ బంగ్లాలోని పలు గదుల్లో తిష్టవేసి తమ సొంత భవనంలా వినియో గించుకుం టున్నారు. ప్రధానంగా సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్ పదవీకాలం ముగిసిన తరువాత కేవలం వైసీపీ నేతగానే (ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి) వున్నారు. పలు సందర్భాల్లో గవర్నర్ బంగ్లాలో నాయకులతో సమావేశాల నిర్వహణకు ఆయనకు అనుమతి ఎలా ఇచ్చారో జిల్లా యంత్రాంగం చెప్పాలి. ఇదిలావుండగా ప్రభుత్వానికి న్యాయపరమైన సలహాలు ఇచ్చే న్యాయవాది ఒకరు సర్క్యూట్ హౌస్‌లో ఒక గదిని నెలల తరబడి తన స్వాధీ నంలో వుంచుకున్నారనిగతంలో ఆరోపణలు వ చ్చాయి. అమర్‌నాథ్ మంత్రి అయిన తరువాత విశాఖ కేంద్రంగానే రాజకీయ కార్యకలాపాలు సా గిస్తున్నారు. సర్క్యూట్‌హౌస్‌లో తరచూ విలే కరులసమావేశాలు ఏర్పాటుచేసి విపక్షాలపై విమర్శలు చేస్తున్నారు. అయితే ఇన్నాళ్లుగా మౌనం గా ఉన్న జిల్లా యంత్రాంగం, ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నతరుణంలోమేల్కొనడం గమనార్హం.



మందులు పంపిణీ చేస్తున్న సర్వసిద్ధి అనంతలక్ష్మి

గీతం వైద్య శిబిరానికి స్పందన

అక్కిరెడ్డిపాలెం, మార్చి 10: ఎన్టీఆర్ సేవా సమితి, గీతం ఆస్పత్రి సంయుక్తంగా 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చింది. గీతం విద్యాసంస్థల చైర్మన్ శ్రీభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం గీతం ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్న ఇటువంటి వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యంతో పాటు గుండె, కళ్లు, దంత వైద్యులు సుమారు 450 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు వెంకటరమణ, జి.తాతారావు, డొప్ప అప్పలరాజు, మురళి, దేముడు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

78 మంది రక్తదానం

గోపాలపట్నం: కళింగ వైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి సంతోష్‌నగర్‌లోని సంఘం భవనంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. విశాఖ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 78 మంది రక్తదానం చేశారు. ఇప్పటివరకు 13సార్లు నిర్వహించిన రక్తదాన శిబిరాలకు దాతల నుంచి మంచి స్పందన వచ్చిందని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు కోరాడ శ్రీనివాసరావు, జి.మధుసూదనరావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి

కూర్మన్నపాలెం, మార్చి 10: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో కాలనీవాసులు ఆదివారం ప్లాస్టిక్‌ను నివారించాలంటూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ తమ కాలనీలో పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించామని, ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానా విధిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వడం, శుభకార్యాల్లో జూట్ బ్యాగులు, కాగితంతో తయారుచేసిన గ్లాసులు, ప్లేట్లను మాత్రమే వాడుతున్నామని పేర్కొన్నారు. ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలి: ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 10: కాలనీలలో జరిగే అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రజలందరూ సహకరించవలసిందిగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. 69వ వార్డు పరిధి తుంగ్లాంలో రూ.50 లక్షల వ్యయంతో కల్యాణ మండపం, రూ.50 లక్షలతో ఆటోనగర్ నుంచి తుంగ్లాం వరకు రహదారి, రూ.20 లక్షలతో షీలానగర్ రహదారి నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ వార్డులోని అన్ని కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి చందు, నాయకులు బోగాది సన్యాసిరావు, ఉరుకూటి బాబూరావు, ఎన్.సింహాచలం, పెట్ల వెంకటరమణ, కాకి అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)

● **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),

● **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)

● **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)

● **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 17, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 268, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 24, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..



వెంకటాపురంలో గణబాబుకు బొట్టు పెడుతున్న మహిళ



బూత్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న బొండా జగన్

టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, మార్చి 10: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 92వ వార్డు పరిధి వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కోసం టీడీపీని గెలిపించాలి

ఎన్.ఎ.డి. జంక్షన్: యువతకు భవిష్యత్తులో ఉపాధి లభించాలంటే టీడీపీని గెలిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం వుడా లేఅవుట్, శివానగర్ పరిసరాల్లో ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వాసుదేవరావు, వి.చంద్రశేఖర్, వినాయక ఆలయ చైర్మన్ మురళీ పట్నాయిక్, వై.తిరుమలరావు,శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి

గాజువాక: వైసీపీ పాలన నుంచి ప్రజలు విముక్తి పొందేందుకు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో వార్డు బూత్ ఇన్‌చార్జిలకు సూపర్ సిక్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లా రంగా, కొమ్మనాపల్లి సింహాచలం, ఉరుకూటి సన్ని, ఎ.రాము, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలి

కూర్మన్నపాలెం: రానున్న ఎన్నికల్లో ప్రజలంతా విజ్ఞతతో వ్యవహరించి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించవలసిందిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ విజ్ఞప్తి చేశారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అధికారం కోసం వైసీపీ అడ్డదారులు తొక్కకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, వర్రె రాంబాబు, రాజన్ రాజు, శ్రీనివాసవర్మ, పి.దానయ్య బి.సూర్యప్రకాశ్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

అగనంపూడి: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ఉజ్వల భవిత ఉంటుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. గెంజిపేటలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం, దౌర్జన్యం, దాడులు తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొండా రమణ, టి.శ్రీను, గెంజి రాజు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

ఎన్నికలకు సైనికుల్లా సిద్ధం కావాలి

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మల్కాపురం, మార్చి 10: త్వరలో జరగనున్న ఎన్నికలకు వైసీపీ సైనికులంతా సిద్ధం కావాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గం వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షులు, కన్వీనర్లు, కో-కన్వీనర్లతో ఆదివారం 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం' అనే కార్యక్రమాన్ని విశాఖ డెయిరీ ట్రస్టు ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసీపీ ప్రభుత్వ ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ గెలుపే మనందరి ధ్యేయం కావాలన్నారు. వైసీపీ వల్లే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, నాయకులు డాక్టర్ ఎస్‌కే రెహమాన్, బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

గోపాలపట్నం: పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. బంక్ కూడలిలో నియోజకవర్గ పరిధిలో ఇళ్లు మంజూరైన 7,820 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పులి వెంకటరమణారెడ్డి

ఐక్య పోరాటంతోనే విజయం సొంతం

ఉక్కు నిర్వాసిత నాయకుడు వెంకట రమణారెడ్డి

కూర్మన్నపాలెం, మార్చి 10: కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించినప్పుడే విజయాన్ని సొంతం చేసుకోవచ్చని ఉక్కు నిర్వాసిత నాయకుడు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,123వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో విశాఖ ఉక్కుకు సముచిత స్థానం ఉందని, స్టీల్‌ప్లాంట్‌పై జరుగుతున్న దాడిని అందరూ ప్రతిఘటించాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే కార్పొరేట్ వ్యవస్థపై అందరూ పోరాడాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు విక్రయించేందుకు కంకణం కట్టుకున్నారని, దీనికి పోరాటాలతో అడ్డుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొమ్మేటి అప్పారావు, జె.రామకృష్ణ, గంగవరం గోపి, వి.ప్రసాద్, నమ్మి సింహాద్రి, పి.సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, దువ్వాడ పోలీసులు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు

కూర్మన్నపాలెం, మార్చి 10: శాంతిభద్రతల పరిరక్షణే తమ ధ్యేయమని దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐ ఎర్రంనాయుడు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆదివాఆరం దువ్వాడ పోలీసులు, కేంద్ర బలగాలు కూర్మన్నపాలెంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజలకు అండగా తాముంటామని భరోసా కల్పించేందుకే ఈ కవాతును నిర్వహించామన్నారు. కవాతును కూర్మన్నపాలెం, ముస్తఫా సెంటర్, వడ్లపూడి, కణితి, శ్రీకృష్ణానగర్, దువ్వాడ, వుడా నగర్‌లలో నిర్వహించారు. కాగా దువ్వాడ రైల్వే స్టేషన్, అగనంపూడి, వడ్లపూడి, తదితర ప్రాంతాల్లో టోల్ గేట్లను ఏర్పాటు చేసి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామని సీఐ తెలిపారు.

రేపటి నుంచి కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు



వేపగుంట, మార్చి 10: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రవినగర్, వెంకట సాయినగర్, అప్పలనర్సయ్య కాలనీ, బంటాకాలనీల్లో కల్యాణ వేంకటేశ్వరస్వామి శోభాయాత్రను చేపట్టనున్నారు. ఈనంతరం వేదనాద మంగళ స్వస్తివాచనం, ఋత్వికరణం, పుట్ట బంగారం సేకరణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు జరుపుతామన్నారు. 13వ తేదీ ఉదయం పది గంటలకు గ్రహదోష నివారణకు నృసింహ ఇష్టి, సాయంత్రం శేషవాహనంపై శ్రీవారి ఊరేగింపు, 14న విద్యా వ్యాప్తి, విదేశీయానం కోసం హయగ్రీవ ఇష్టి, 15న ఐశ్వర్య ప్రాప్తికి శ్రీయాగం, మహాలక్ష్మీ అవహనం నిర్వహించనున్నారు. అలాగే 16న ఆరోగ్య ప్రాప్తి, శత్రు జయం కోసం శ్రీసుదర్శన ఇష్టి, సాయంత్రం స్వామివారి తిరు కల్యాణోత్సవం, అన్న సమారాధన, 17వ తేదీ ఉదయం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, చక్రస్నానం, ధ్వజారోహనం, సాయంత్రం శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, ఊంజల్ సేవ నిర్వహిస్తామని అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు.

చిన్నారులు ఇష్టంగా పుస్తకాలు చదవాలి

పెదగంట్యాడ, మార్చి 10: పిల్లలందరూ ఇష్టపడి మరీ పుస్తకాలు చదవాలని పెదగంట్యాడ గ్రంథాలయాధికారి పీవీ రమణ కోరారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన గ్రంథాలయంలో పలువురు చిన్నారులతో పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. సామాజిక,చారిత్రాత్మక, సాంకేతిక అంశాలతో కూడిన కథలను చదవడం వల్ల ఆయా అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు.



గంగవరం బడేవారి వీధిలో తాళాలు వేసి ఉన్న మరుగుదొడ్ల సముదాయం

మరుగుదొడ్ల సముదాయానికి తాళాలు

ఐదు నెలలుగా ఇదే పరిస్థితి..

వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

పెదగంట్యాడ, మార్చి 10: జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరంలోని బడేవారివీధిలోని ప్రజా మరుగుదొడ్ల సముదాయానికి తాళాలు వేశారు. జీవీఎంసీ అధికారులు దీనికి పూర్తిగా మరమ్మతులు చేసిన తర్వాత తాళాలు వేయడం గమనార్హం. మరుగుదొడ్ల సముదాయానికి నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటారు మరమ్మతులకు గురవ్వడం వల్ల దీనికి తాళాలు వేశారు. ఈ మోటారుకు మరమ్మతులు చేపట్టడం కానీ కొత్తది బిగించడం గానీ చేయకపోవడంతో ఐదు నెలలుగా నిరుపయోగంగా ఉంది. బడేవారి వీధికి చెందిన వారితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ మరుగుదొడ్ల సముదాయాన్ని వినియోగించుకునేవారు. ఇప్పుడు దీనికి తాళాలు వేయడంతో ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాల్లోని మరుగుదొడ్ల సముదాయాలను వినియోగించుకోవాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. అయితే పలువురు స్థానికులు ఈ మరుగుదొడ్ల సముదాయం అందుబాటులో లేకపోవడంతో బహిరంగ ప్రదేశాలనే వినియోగించుకుంటున్నారు. నెలలు గడుస్తున్నా దీనిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికంగా ఉంటున్న పలువురు మహిళలు తెలిపారు. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి దీనిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

డంపింగ్ యార్డును తరలించాలని ధర్నా



యార్డును తరలించాలని నినాదాలు చేస్తున్న దృశ్యం

గాజువాక, మార్చి 10: జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తరలించాలంటూ పల్లా కార్తీక్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం యార్డు వద్ద స్థానికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దన్నారు. ప్రజలు అనారోగ్యాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 10: స్టీల్‌ప్లాంట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ప్లాంట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షునిగా బీఎంకే నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోతు కృష్ణ, కోశాధికారిగా రత్నకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శివరాం, సంయుక్త కార్యదర్శిగా డి.రాజు నాయక్, ఉపాధ్యక్షునిగా ఎ.తిరుపతినాయక్, సంయుక్త కోశాధికారిగా ఆర్.తిరుపతినాయక్‌లను ఎన్నుకున్నారు.



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఆదర్శనీయం.. సావిత్రిబాయి పూలే జీవితం

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, మార్చి 10: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు విశేషనీయమైనవని టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పూలే వర్ధంతిని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, కుల మతాలకు అతీతంగా ఆమె అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, వెంకటేశ్వరరావు, నూకరాజు, పెంటిరాజు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి అప్పికొండలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. పలువురు బీసీ నాయకులు, గ్రామ పెద్దలు ఎన్నేటి రమణ, ప్రగడ వేణుబాబులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయినిగా, రచయితగా, కుల వ్యవస్థ కోసం ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.దామోదర్, బి.గోవిందరాజు, ఎన్నేటి కుమారి, బుల్లెట్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ గాజువాక నుంచే పోటీ చేయాలి

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోన తాతారావు

కూర్మన్నపాలెం, మార్చి 10: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గాజువాక నియోజకవర్గం నుంచే పోటీ చేస్తే జనసైనికులందరం గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 3,200 మంది బూత్ స్థాయి సభ్యులు, 8,000 మంది వార్డు, మండల, క్రియాశీలక సభ్యులు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నట్టు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పవన్‌కల్యాణ్ విన్నపం మేరకే ఆపిందన్నారు. పవన్‌కల్యాణ్ గాజువాక నుంచి పోటీ గెలిస్తే స్థానికంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలైన గంగవరం పోర్టు, ఫార్మా, ఏపీఐఐసీ, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక్క కర్మాగారం వచ్చింది లేదని విమర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, కరణం కనకారావు, గవర సోమశేఖర్, గంధం వెంకటరావు, కాదా శ్రీను, లంకల మురళీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



పెదగంట్యాడ, మార్చి 10: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లోని నూకాంబిక అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కాలనీకి చెందిన మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశాక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

ముగిసిన రాసాలమ్మ వార్షికోత్సవాలు

కూర్మన్నపాలెం, మార్చి 10: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీ ప్రజల ఆరాధ్య దైవం రాసాలమ్మ తల్లి వార్షికోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు కెనర సింహశాస్త్రి పర్యవేక్షణలో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మందుగుండు సామగ్రి కాల్పివేత నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.వేణుబాబు, ఎన్నేటి రమణ, ఎం.దామోదర్, బొండా గోవిందరాజు, ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ప్రతినిధులు ఒమ్మి అప్పల నాయుడు, జి.సింహాచలం నాయుడు, వెంకటసుబ్బయ్య, ఎం.మురళీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడడమే మోదీ లక్ష్యం

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మార్చి 10: సనాతన ధర్మాన్ని కాపాడుతూ దేశ ఔనత్యాన్ని కీర్తింపజేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి విశేషమైనదని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. నగరంలో ఆదివారం జరిగిన మహా నగర్ సాంఘిక్ కార్యక్రమానికి గాజువాక నుంచి ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించి 99 ఏళ్లవుందని, నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది మహనీయులను ఆర్ఎస్ఎస్ దేశానికి అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, నూకరాజు, నాగేశ్వరరావు, రమణ, తాతారావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలకు సత్కారం

అగనంపూడి, మార్చి 10: స్థానికంగా గల నడక మైదానం వద్ద విశ్రాంతి తీసుకునేందుకు బెంచీలు సమకూర్చిన దాతలు విందుల కరుణాకరరావు, చిన్ని కనకారావు, శేఖర్‌లను వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ నడక మైదానం అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ మైదానం ఉక్కు నిర్వాసితులతో పాటు ఫార్మాసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఎం.నరసింగరావు, బి.సత్యనారాయణ, కె.పైడిరాజు, బి.కాళిదాసు, పూర్ణ, నరసింగరావు, మంగరాజు, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 10: తెలంగాణ ఉద్యోగుల మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించారు. ఉక్కు కర్మాగారం ప్రగతి కోసం తెలంగాణ ఉద్యోగులు చేస్తున్న కృషి, అదేవిధంగా మహిళలు చేస్తున్న కార్యక్రమాలను పలువురు కొనియాడారు. తొలుత కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఎంతో ఆనందంగా వేడుకలను నిర్వహించి, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జి.లత, వసంత, జ్యోతి, కవిత, దేవకి, లలిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తర టీడీపీ సమావేశం

అక్కయ్యపాలెం, మార్చి 10: విశాఖ ఉత్తర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడానికి ఈ సమావేశం ఏర్పాటుచేశారు. మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడుపల్లా శ్రీనివాసరావు, పార్లమెంటు ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ ఈ సమావేశంలో పాల్గొంటారు.

జోన్-5 పరిధిలోని దుకాణాలకు వేలం రేపు

జ్ఞానాపురం, మార్చి10: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు లీజుకు ఈనెల 12వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోన్-5 కమిషనర్ ఆర్.జీ. కృష్ణ ప్రకటనలో తెలిపారు. కంచరపాలెంలోని ఆశోక్‌నగర్, 60వ వార్డు గుల్లలపాలెం, 58వ వార్డు సంజీవయ్యకాలనీలోని ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలకు, అలానే మాధవదారలోని మాధవస్వామి కల్యాణమండపం, కంచరపాలెం నుంచి 104 ఏరియా వరకు రోడ్డు సైడ్ మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్డు సైడ్ మార్కెట్ లీజు ప్రాతిపాదికన కేటాయించేందుకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'ముస్లింలకు టికెట్ కేటాయించాలి'

మహారాణిపేట, మార్చి 10: ఉత్తరాంధ్రలో తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీలకు శాసనసభలో పోటీచేసే అవకాశం కల్పించాలని విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ ముస్లిం మైనారిటీ సంఘం కోరింది. ఆదివారం విలేకరులతో నాయకులు షేక్ రహ్మతుల్లా, మహ్మద్‌గౌస్‌లు మాట్లాడుతూ, ముస్లిం ఆత్మగౌరవం కాపాడేందుకు అధిష్టానం ముందుకు రావాలని కోరారు. ప్రజల్లో గుర్తింపుఉన్న టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మహమ్మద్ నజీర్‌కు దక్షిణ నియోజక వర్గ టికెట్ కేటాయించాలని కోరారు. ఈమేరకు నజీర్‌పై ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా సర్వే చేయించి మెజార్టీ అభిప్రాయం మేరకు సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మౌలిక వసతుల కల్పన

కంచరపాలెం, మార్చి 10: మౌలిక వసతుల కల్పనతో జీవీఎంసీ 48వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్టు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు పేర్కొన్నారు. ఆదివారం ఇందిరానగర్, బాపూజీ నగర్‌లో జరుగుతున్న రోడ్డు, కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 48వ వార్డు పూర్తిగా కొండపై ఉందన్నారు. కోట్లాది రూపాయాలుతో ఈ వార్డులో రోడ్లు, డ్రైన్లు, సామాజిక భవనాల నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. వార్డులో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులుతో మాట్లాడుతు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఊర్వశి జంక్షన్ నుంచి బర్మాక్యాంప్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్టు వివరించారు.

ముగిసిన దుర్గాలమ్మ ఉత్సవాలు

పూర్ణామార్కెట్, మార్చి 10: గ్రేటర్ 35వ వార్డు పరిధిలో దుర్గాలమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన అమ్మవారి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పూర్ణామార్కెట్ శ్రీవరసిద్ధి వినాయక వర్తక సంఘం ప్రతినిధి గంగాడ గోవింద్ ఆధ్వర్యంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావును స్థానిక దుర్గాలమ్మ సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో యువతకు పూర్తి సహకారం అందించడంపై ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

మాతృభాషలో బోధనకు సమష్టి కృషి



మాట్లాడుతున్న రచయిత డీవీ సూర్యారావు

సీతంపేట, మార్చి 10: రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో కచ్చితంగా మాతృభాష తెలుగుభాషలోనే కొనసాగేలా సమష్టిగా కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో తెలుగు దండు ఆధ్వర్యంలో ఆత్మీయ సమాలోచనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొని తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు సూరి రాజకీయ అరంగేట్రానికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత మహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూరారావు మాట్లాడుతూ పరవస్తు సూరి తన ఎజెండాలో మాతృభాష రక్షణకే ప్రథమ ప్రాధాన్యం కల్పించారన్నారు. పరవస్తు సూరి మాట్లాడుతూ మాతృభాష రక్షణ కోసం పాలకుల చుట్టూ తిరిగి విసిపోయి తప్పనిసరి పరిస్థితులో రాజకీయాల్లోకి వచ్చినట్టు చెప్పారు. అలాగే ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టుకునేందుకు పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలన్నారు. మన జాతి హక్కుల కోసం పోరాడి సాధిస్తానని ప్రతిజ్ఞ చేశారు. రాజకీయ విశ్లేషకులు కిరణ్‌కుమార్, డాక్టర్ ఆనంద్, రాజమన్నార్, భానుకుమార్, సాహితివేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, శంకర్ నీలు, చిన సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోర్టు స్టేడియం ప్రైవేటీకరణ తగదు

▸▸ వార్వా అధ్యక్షుడు ప్రకాశరావు



ధర్నా చేస్తున్న వార్వా ప్రతినిధులు

అక్కయ్యపాలెం, మార్చి 10: నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు స్టేడియంను ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటీకరించడం తగదని వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. ప్రకాశరావు, బీటీ గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పోర్టు స్టేడియం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోర్టు స్టేడియం పోర్టు ట్రస్ట్‌కి చెందిందని, అంటే అది ప్రజల ఆస్తి అన్నారు. అందువల్ల పోర్టు ట్రస్టే దీని నిర్వహణ బాధ్యత చూడాలన్నారు. కానీ, ప్రస్తుతం స్టేడియంను విశ్వనాథ్ అనే వ్యక్తికి కాంట్రాక్ట్‌కు ఇచ్చారన్నారు. దీంతో ఇంతవరకు స్టేడియంలో ఉచితం, లేదా నామ మాత్ర ఫీజులతో ఆడుకునే వీలుండేదన్నారు. విశ్వనాథ్ తీసుకున్న తర్వాత అన్ని విభాగా ల్లో డబ్బు వసూలుచేస్తున్నారన్నారు. స్టేడియంలో ఒక రోజంతా క్రికెట్ ఆడాలంటే రూ.36వేలు చెల్లించాల్సి వస్తుందని, దీని బట్టీ ఇతర ఫీజులు అంచనా వేసుకోవచ్చన్నారు. తక్కువ ఫీజుతో ప్రజలు హెల్త్ వాక్ చేస్తున్నారని, ఇకపై భారీ ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యంపై చూపుతుందున్నారు. పిల్లలు, యువకుల ఆటలకు విఘాతం కలిగిస్తోందని పేర్కొన్నారు. స్టేడియంలోని చెట్లు నరికివేసి కాంక్రీట్ జంగిల్ గా మార్చి భవనాలు నిర్మిస్తుండడంతో పర్యావరణానికి తీ వ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పోర్టు స్టేడియం ప్రైవేటీకరణ అన్ని విధాల నగరవాసులకు నష్టదాయకమని, ఈస్థితిలో ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నివాస్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి.లచ్చిరాజు, పిట్టా నారాయణ మూర్తి, అక్కయ్యపాలెం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, మురళీ రాజు, బీఎల్ నారాయణ, బి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంలో ఆదర్శ దంపతులు



పార్థివ దేహాలు దానం చేసిన దంపతులు

సీతమ్మధార, మార్చి 10: రెండేళ్ల కిందట భర్త పార్థీవ దేహం దానం చేశారు.. ఆయన అడుగుజాడల్లో భార్య అనుసరించి ఆదర్శంగా నిలిచారు. వివరాలివి.. సీతమ్మధారకి చెందిన కేవీ రమాదేవి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి అప్పగించారు. ఇదిలాఉండగా, ఆమె భర్త కేఆర్‌ఎస్‌ఎస్ శాస్త్రి 15 ఏళ్ల కిందట సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన భౌతిక కాయాన్ని దానం చేసేందుకు అంగీకరిస్తూ వీలురాశారు. జైలర్‌గా పనిచేసిన శాస్త్రి ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి, ఆయన పార్థీవ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అందజేశారు. భార్య రమాదేవి భర్త ఆశయాలకు అనుసరించారు. ఈమేరకు ఆదివారం ఆమె కోరిక మేరకు కళ్లను కేవీ ప్రసాద్ ఐ ఆసుపత్రికి, పార్థివ దేహాన్ని సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగించారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం



హలీం సెంటర్ ప్రారంభోత్సవంలో సీతంరాజు

మహారాణిపేట, మార్చి 10: ఆధ్యాత్మికంగా రంజాన్ మాసం ఎంతో పవిత్రమని దక్షిణ నియోజక వర్గ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో మహారాణిపేటలోని మక్కా మసీదు సమీపంలో హైదరాబాద్ హలీం సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. రంజాన్ ఉపవాస దీక్ష అనంతరం ముస్లింలు స్వీకరించే హలీం సెంటర్‌ను ఏటా నిర్వహించడం మంచి సాంప్రదాయమన్నారు. ప్రపంచంలో సైన్సు అభివృద్ధి చెందని రోజుల్లోనేహలీంను సాయంత్రపు ఆహారంగా ఉపయోగించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు , 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్‌అలీ, 42 వవార్డు కార్పొరేటర్ అల్ల లీలావతి పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యలో మార్పు అవసరం

▸▸ అపూస్మా సమావేశంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి10 : యువతలో నైపుణ్యాలు పెరగాలంటే ప్రాథమిక విద్యా విధానంలో గణనీయమైన మార్పులు అవసరమని గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎమ్.శ్రీభరత్ అన్నారు. ఆదివారం ఆయన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపూస్మా) రాష్ట్ర స్థాయి టీచర్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల స్థాయి దాటి కళాశాలలకు వచ్చే యువతలో అధిక శాతం మందికి భవిష్యత్తుపై సరైన దిశా నిర్దేశం ఉండడం లేదన్నారు. ప్రాథమిక స్థాయి విద్యా బోధనలో బలమైన పునాదులు వుంటే వారి జీవితంలో ఎదగడానికి కారణమవుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రైవేటు విద్యాలయాలు మారినప్పుడే మనుగడ సాధ్యమన్నారు. అధ్యాపకులు తమను తాము సాంకేతికంగా తీర్చిదిద్దుకోవాలని, ఇది ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య బోధించే వారి వరకు వర్తిస్తుందని చెప్పారు. ప్రాథమిక విద్యను బోధించే పాఠశాలలకు గీతం మార్గదర్శిగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపూస్మా రాష్ట్ర మార్గదర్శి ఎ. కృష్ణారెడ్డి, కోశాధికారి ఎంవీరావు, విశాఖ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణ, జి. శేషగిరిరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, మార్చి 10: శ్రీ నందగిరి సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వ ర్యంలో 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు స్థానికులకు వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్ ఎండీ కె.రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతినెలా పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు జనరల్ చెకప్‌లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సిబ్బంది సుజాత, కోటి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెం ఏడుగుళ్లు అమ్మవారి ఆలయం అప్పగించాలి

▸▸ గ్రామ కమిటీ డిమాండ్ ▸▸ గ్రామస్తుల నిరసన ర్యాలీ



ఏడుగుళ్లు అమ్మవారి ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సీతమ్మధార, మార్చి 10: గ్రేటర్ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం వాసుల ఆరాధ్య దైవంగా ఉన్న ముత్యాలమ్మ ఏడుగుళ్లు అమ్మవారి ఆలయాన్ని తమకే అప్పగించాలని గ్రామ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం గ్రామ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన తెలిపారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దుంగి ప్రసాదరెడ్డి, దిలీప్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఈ ఆలయం తమ తాత, ముత్తాతల నుంచి వస్తుందన్నారు. రోజూ పూజలు, ఏటా పండుగలు చేస్తున్నామన్నారు. అయితే, ప్రస్తుతం స్థలాల ధర పెరగడంతో అక్కడే ఉన్న ఎరుసు నరసింగరావు కుటుంబ సభ్యులు ఆలయాన్ని ఆక్రమించి ఆ స్థలం తమదేనంటూ ఆలయాన్ని సొంతం చేసుకుని, భక్తులనుంచి డబ్బు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం వెనుక ఉన్న స్థలంలో బహుళ అంతస్తుల భవనాన్ని ప్రస్తుత 15వ వార్డు కార్పొరేటర్ భర్త గిరిబాబుకి చాలాకాలం క్రితం ఒప్పందం కుదుర్చుకుని నిర్మాణం ప్రారంభించారన్నారు. అయితే, దీనిపై గ్రామస్తులు కోర్టులో కేసు వేయడంతో ఈ నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఇప్పుడు గిరిబాబు తన భార్య అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ కావడంతో ఆలయానికి చెందిన స్థలంలో రోడ్డు వేసి జీవీఎంసీ నిర్మించిన డివైడర్‌ను తొలగించి రాత్రికి రాత్రే రోడ్డు నిర్మాణం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి చెందిన స్థలంలో రహదారి నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బర్ల బాలకృష్ణ, మజ్జి ఉమామహేశ్వర రావు, నక్క రమేష్ రెడ్డి, బోర శ్రీనివాస రెడ్డి, చుక్క శ్రీనివాసరెడ్డి, పిడింట్ల రమేష్, గుడ్ల కాటారాజు రెడ్డి, ఎరుసు మునీంద్రరెడ్డిగ్రామకోర్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వనందునే ఆందోళన: ఆలయ ధర్మకర్త నరసింగరావు

తమ తాతలకు చెందిన ఏడుగుళ్ల ఆలయ స్థలం తమదేనని ఆలయ ధర్మకర్త ఎరుసు నరసింగరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్నాళ్ల కిందట గ్రామ కమిటీ ప్రతినిధులు అమ్మవారి ఆలయాన్ని గ్రామానికి అప్పగించాలని కేసు వేశారన్నారు. ఈ కేసు తాను గెలిచినట్టు చెప్పారు. తర్వాత దుంగి ప్రసాద్‌రెడ్డి, దుంగి దీలిప్, దుంగి రమేష్‌లు తమకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, లేకపోతే వివాదం సృష్టి స్తామని బెదిరించారన్నారు.ఈ నేపథ్యంలోనే ఆందోళన చేస్తున్నారన్నారు.

ఎర్నిమాంబ ఆలయ కమిటీకి అభినందన

జ్ఞానాపురం, మార్చి 10: నూతనంగా నియమితులైన స్థానిక ఎర్నిమాంబ ఆలయ ట్రస్ట్ బోర్డు కమిటీని 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబరు కోడిగుడ్ల పూర్ణిమ అభినందించారు. వార్డు కార్యాయంలో ఆమెను వారు ఆదివారం కలిశారు. అనంతరం సభ్యులు సోమవారం ట్రస్ట్ సభ్యులకు జరగనున్న సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరుకావాల్సిందిగా కార్పొరేటర్‌ను ఆహ్వానించారు. ఆలయ ఈఓసురేశ్‌బాబా, కమిటీ చైర్మన్ లండారమణ, సభ్యులు చుక్కా శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ సెంటర్స్‌తో ఆత్మీయ సమావేశం

అక్కయ్యపాలెం, మార్చి 10: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఉత్తర నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కేకే రాజుకు మద్దతుగా షాదీఖానా కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జీవీ రవిరాజు ఆధ్వర్యంలో బాక్సింగ్ సెంటర్స్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డి.రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ దేవ్, కె.నూకరాజు తదితరులు పాల్నొరు.

మురళీనగర్; రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.రాజు క్షత్రియ సామాజిక వర్గ ప్రతినిధులను కోరారు. 50వవార్డులో పలు కాలనీల క్ష త్రియ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మార్చి 10 : నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం, ఆంధ్రజ్యోతి ఏరియా, సంతోషిమాత కాలనీ, వైఎస్సార్ కాలనీ, టిడ్కో కాలనీల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

పట్టాలు తప్పిన భవానిపట్న పాసింజర్ రైలు

▸▸ ఇంజన్‌తోపాటు పక్కకు ఒరిగిన రెండు బోగీలు

విశాఖపట్నం, మార్చి 10: విశాఖ నుంచి ఒడిశాలోని భవానీపట్న వెళ్తున్న ప్రత్యేకపాసింజర్ రైలు (08504) విజయనగరం జిల్లా కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు విశాఖ నుంచి బయలుదేరిన ఈ రైలు 7.00 గంటల సమయంలో కొత్తవలస రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుండగా లోకో (ఇంజన్), ఒక జనరల్ కోచ్, ఎస్‌ఎల్‌ఆర్ కోచ్‌లు పట్టాలు తప్పాయి. బోగీలు ఒకవైపునకు కొద్దిగా ఒరగడంతో ప్రయాణికులు భయాందోళనచెందారు. బోగీలు పక్కకు పడకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదిక పునరుద్ధరణ పనులు చేపట్టారు. సుమారు గంటన్నర తరువాత రైలు తిరిగి బయలుదేరింది. ఈ సంఘటనతో ఇతర రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయంలేదు.

ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

▸▸ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

డాబాగార్డెన్స్, మార్చి 10: ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ, ఇతర గిరిజన సమస్యలపై ఆదివారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ దరి అంబేద్కర్ విగ్రహం ఎదుట మన్యం బంద్‌కు మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు 100 శాతం తమకు ఇవ్వాలన్నారు. జీవో 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలన్నారు. రాష్ట్రంలో నాన్‌షెడ్యూల్డ్ 1500 గిరిజన గ్రామాలకు షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆదివాసీ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు, ఆయుధ కర్మాగార నిర్మాణం రద్దు చేయాలన్నారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఏపీ ప్రభుత్వ పోర్టల్ వెబ్‌సైట్‌లో ఆదివాసీవాల్మీకి, కొండదొర తెగలను పునరుద్ధరించాలని కోరారు. సభ్యులు జోంజుబాబు, బొండా తౌడన్న, ఎం.గౌరీశంకర్, టి.శంకరరావు, కోటిబాబు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఆర్.సత్యారావు, రామన్న, రామారావు, గోపాల్, దిస్మన్‌కాంత్ పాల్గొన్నారు.

నిఘా నిద్రపోతోంది!

... 5వ పేజీ తరువాయి

వరుస చోరీలు జరిగాయి.

▸▸ నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి రైల్వేన్యూకాలనీలో ఉంటున్న విశ్రాంత పోస్టల్‌శాఖ ఉద్యోగి ఇంట్లో అతని కుమా ర్తె స్నేహితురాలైన సినీనటి సౌమ్య సుమారు 70తులాల బంగారాన్ని అపహరించుకుని పోయింది. ఆమెపై బాధితుడు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు తమదైనశైలిలో విచారించి కేసుని ఛేదించగలిగారు. అదే అనుమానం వ్యక్తంచేసి ఉండకపోతే నేరం ఎవరు చేశారనే దానిపై పోలీసులు ఇంతవరకూ ఒక అంచనాకు వచ్చే పరిస్థితి లేదు. నగరంలో గతనెలరోజులుగా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఇళ్లలో చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు జరుగుతూనే ఉండడం పోలీస్ వర్గాలను సైతం ఆందోళనకు గురిచేస్తోంది.

పోలీసులకు సవాల్ : రాష్ట్రంలో విశాఖ నగరానికి ప్రాధాన్యం పెరగడంతో సీపీగా ఐజీ ర్యాంక్ స్థాయి అధికారి నుంచి అదనపు డీజీపీ స్థాయి ర్యాంక్ అధికారిని నియమించారు. అంతేకాకుండా కొత్తగా జాయింట్ పోలీస్ కమిషనర్‌తోపాటు జోన్-2కి రెగ్యులర్ డీసీపీగా ఐపీఎస్ అధికారిని కేటాయించారు. క్రైమ్ విభాగానికి నాన్‌కేడర్ ఐపీఎస్ అధికారిని డీసీపీగా నియమించారు. సీసీఎస్‌కు, క్రైమ్‌కు వేర్వేరుగా ఇద్దరు ఏసీపీలను కేటాయించారు. సీఐలతోపాటు ఎస్‌ఐలను కూడా భారీగానే కేటాయించారు. నగరంలో బందోబస్తులు, ప్రముఖుల పర్యటనలు, సమావేశాల కారణంగా అదనపు సిబ్బంది అవసరమని అధికారులు చెబుతున్నా, గతంలో పోల్చితే కేటాయింపు భారీగానే పెరిగిందని అంగీకరిస్తున్నారు. అలాంటి పరిస్థితిలో నగరంలో నేరాలను కనీసస్థాయికి తగ్గించాల్సి ఉన్నప్పటికీ, దీనికి భిన్నంగా రోజురోజుకీ పెరుగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ పరిణామం పోలీస్ అధికారులకు సైతం సవాల్‌గానే మారిందనే చెప్పుకోవాలి. నేరాల నియంత్రణపై పోలీస్ అధికా రులు మాటలే తప్ప, ఆచరణలో చూపించకపోవడమే నేరాల పెరుగుదల కారణంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రాత్రి గస్తీ పక్కాగా జరిగేది. బీట్‌ల సంఖ్య కూడా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ గరిష్ట సంఖ్యలో నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం రాత్రి గస్తీ, బీట్‌ల నిర్వహణ తూతూమంత్రంగా మారిపోయింది. రాత్రిగస్తీ సిబ్బంది కొంతసేపు నగరంలో తిరిగి తర్వాత ఏదో ఒకసినిమా థియేటర్‌కు వెళ్లి సినిమా చూసుకుని గడిపేయడం, లేదంటే ఇంటికి వెళ్లి నిద్రపోయి తెల్లవారుజామున తిరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బీట్‌బుక్‌ను అందజేస్తున్నారని పోలీస్ సిబ్బందే చెబుతుండడం పరిస్థితికి అద్దంపడుతోంది.

అధ్వానంగా సీసీ కెమెరాలు: నగరంలో నేర నియంత్రణే లక్ష్యంగా పదేళ్ల కిందట ప్రజా భద్రత చట్టం కింద ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కు టార్గెట్లు విధించి రద్దీగా ఉండే ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, ఆలయాలు, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అపార్టుమెంట్ల అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటుచేసి సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలాచర్యలు తీసుకున్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా దాదాపు 580 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ప్రతి కూడలిలోనూ వీటిని ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడైనా చోరీ జరిగితే ఆ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించి అనుమానితులను గుర్తించేవారు.కానీప్రస్తుతంచాలావరకు సీసీకెమెరాలు మూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేయించే నాథుడే లేకుండా పోయారు. పోలీసులు కూడా నేరం జరిగిన సందర్భగా సీసీ కెమెరాలపై హడావుడి చేసి తర్వాత వదిలేస్తున్నారు.

వలంటీర్ల బెదిరింపులు

... 5వ పేజీ తరువాయి

బెదిరిస్తున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి పేరిట ముద్రించిన రెండు పేజీల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో అన్ని వార్డు/గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికి ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీలోగా కరపత్రాలను పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా వలంటీర్ మొబైల్ యాప్‌లో ఈకేవైసీ (బయోమెట్రిక్) తీసుకోవాలని, ప్రభుత్వ పథకాల వల్ల సదరు కుటుంబానికి ఎంత మొత్తం అందింది? అన్నది సర్వే చేయాలని స్పష్టం చేశారు. అయితే వలంటీర్లు ఇంతవరకే పరిమితం కాకుండా వైసీపీకి మద్దతుగా ప్రజలపట్ల బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తున్నారు. జగనన్నే మళ్లీ సీఎంగా రావాలంటూ బయోమెట్రిక్ వేయండి, లేకపోతే పథకాలు ఆగిపోతాయి అని హెచ్చరిస్తున్నారు. ఆదివారం విశాఖలోని రైల్వేన్యూకాలనీలో ఒక అపార్టుమెంట్‌కు వలంటీర్ వెళ్లి కరపత్రాలు పంపిణీచేసి, జగనన్నే మళ్లీ సీఎంగా రావాలంటూ బయోమెట్రిక్ వేయాలని చెప్పడంతో వివాదం నెలకొంది. బయోమెట్రిక్ వేయాలని బలవంతం చేయడం ఏమిటని ఒక మహిళ గట్టిగా నిలదీశారు. అపార్టుమెంట్‌లోని ఇతర ఫ్లాట్లలో వుంటున్న వారు బయటకు వచ్చారు. దీంతో వలంటీరు అక్కడ నుంచి బయటకువెళ్లి సచివాలయ ఉద్యోగికి సమాచారం ఇచ్చారు. సదరు ఉద్యోగి వచ్చి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. జగన్ మళ్లీ రావాలని తాము చెప్పమనలేదని, ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేసే కరపత్రాలను మాత్రమే పంపిణీ చేయాలని చెప్పామన్నారు.

వైసీపీ నేతల క్యాలండర్లను పంపిణీ చేసిన వలంటీర్

విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు ఫొటోతో ముద్రించిన క్యాలండర్లను ఆదివారం మాధవధారలో వలంటీర్ పంపిణీ చేయడం వివాదమైంది. స్థానిక టీడీపీ నాయకులు తాతినేని శ్రీనివాసరావు, మరికొందరు అడ్డుకుని అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వ సొమ్మును గౌరవ వేతనంగా తీసుకుంటూ.. వైసీపీ నాయకుల ఫొటోలతో ముద్రించిన క్యాలండర్లను ఎలా పంపిణీ చేస్తావంటూ నిలదీశారు. దీంతో వలంటీర్ అక్కడ నుంచి జారుకున్నాడు.

ప్రతి ఇంటికి సీఎం కరపత్రం అందించాల్సిందే

వలంటీర్లకు సచివాలయ కార్యదర్శి హుకుం

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఆదివారం సాయంత్రంలోగా ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి ఒకరు వలంటీర్లను హెచ్చరిస్తూ పెట్టిన వాయిస్ మేసేజ్ విశాఖ నగరంలో హల్‌చల్ చేస్తోంది. ముఖ్యమంత్రి పేరిట ఉన్న కరపత్రాల పంపిణీ శతశాతం పూర్తికావాలని, ఒకవేళ కాకపోతే అందుకు గల కారణాలను చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని బెదిరించారు. కరపత్రాలు పంపిణీ సమయంలో ప్రతి ఇంట్లో ఒకరి నుంచి ఈకేవైసీ చేయించాలని, ఇందుకు సర్వర్ స్పీడ్‌గాఉందని చెప్పడం గమనార్హం. ఒకవేళ ఆదివారం సాయంత్రానికి కరపత్రాల పంపిణీ, ఈకేవైసీ చేయని వలంటీర్లంతా సోమవారంఉదయంజోనల్ కమిషనర్ కార్యాలయానికి హాజరుకావాలని ఆదేశించారు.

కొత్త జిల్లాలకు ఎస్‌ఈలు ఏరి?

... 5వ పేజీ తరువాయి

విశాఖ జిల్లా ఎస్‌ఈతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను నడిపిస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో స్పందన కార్యక్రమం జరుగుతుంది. విద్యుత్ శాఖ సమస్యలపై చర్చించేందుకు ఎస్‌ఈ ఉండాలి. మూడు జిల్లాలకు కలిపి ఒకరే ఎస్‌ఈ ఉండడంతో ఒక్కచోట మాత్రమే హాజరుకాగలుగుతున్నారు. స్మార్ట్‌సిటీగా విశాఖకు, వందలాది పరిశ్రమలున్న జిల్లాగా అనకాపల్లికి, ఏజెన్సీ కేంద్రంగా అల్లూరి జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక్కరే ఎస్‌ఈతో పని విభజనకు అవకాశం లభించడం లేదు. విశాఖలో జిల్లా పరిషత్ సమావేశాలు నిర్వహించినప్పుడు అనకాపల్లి, అల్లూరి జిల్లా ప్రజాప్రతినిధులు దీనిపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకువెళుతున్నా ఫలితం కనిపించడం లేదు,

ఏళ్లుగా పదోన్నతులూ లేవు

ఈపీడీసీఎల్‌లో ఇంజనీర్లకు ఏళ్ల తరబడి పదోన్నతులు కల్పించడం లేదు. అసిస్టెంట్ ఇంజనీర్ ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నా డివిజనల్ ఇంజనీర్ కాలేకపోతున్నారు. కొత్త జిల్లాల్లో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే సీనియర్ డీఈలకు ఎస్‌ఈలుగా, మిగిలిన వారికి ఇతర హోదాల్లో పదోన్నతులు లభిస్తాయి. ఆయా కార్యాలయాలకు అవసరమైన సిబ్బందిని నియమించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్ల అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నాయి.

సర్క్యూట్‌హౌస్‌లో రాజకీయ ప్రెస్‌మీట్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

మార్చేశారు. గతంలో ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా వున్న ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రస్తుత ఇన్ చార్జి వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఇతర నేతలుగవర్నర్ బంగ్లా వేదికగా విపక్షాలపై దుమ్మె త్తిపోస్తూ వస్తున్నారు. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జులు గా ఉన్న నేతల వెంట వచ్చే కిందిస్థాయి నాయ కులు గవర్నర్ బంగ్లాలోని పలు గదుల్లో తిష్ఠవేసి తమ సొంత భవనంలా వినియో గించుకుం టున్నారు. ప్రధానంగా సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్ పదవీకాలం ముగిసిన తరువాత కేవలం వైసీపీ నేతగానే (ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి) వున్నారు. పలు సందర్భాల్లో గవర్నర్ బంగ్లాలో నాయకులతో సమావేశాల నిర్వహణకు ఆయనకు అనుమతి ఎలా ఇచ్చారో జిల్లా యంత్రాంగం చెప్పాలి. ఇదిలావుండగా ప్రభుత్వానికి న్యాయపరమైన సలహాలు ఇచ్చే న్యాయవాది ఒకరు సర్క్యూట్ హౌస్‌లో ఒక గదిని నెలల తరబడి తన స్వాధీ నంలో వుంచుకున్నారనిగతంలో ఆరోపణలు వ చ్చాయి. అమర్‌నాథ్ మంత్రి అయిన తరువాత విశాఖ కేంద్రంగానే రాజకీయ కార్యకలాపాలు సా గిస్తున్నారు. సర్క్యూట్‌హౌస్‌లో తరచూ విలే కరులసమావేశాలు ఏర్పాటుచేసి విపక్షాలపై విమర్శలు చేస్తున్నారు. అయితే ఇన్నాళ్లుగా మౌనం గా ఉన్న జిల్లా యంత్రాంగం, ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నతరుణంలోమేల్కొనడం గమనార్హం.


స్వర్ణ పుష్పాలతో పూజిస్తున్న అర్చకస్వామి

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మార్చి 10 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి బంగారు సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసారు. బేడా మండప ప్రదక్షిణ తరువాత భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ నామానికొక బంగారు పుష్పంతో అర్చన జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

జూపార్కుకు పర్యాటకుల తాకిడి

ఆరిలోవ, మార్చి 10 : నగరంలోని జూపార్కుకు సందర్శకులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 3040 మంది పర్యాటకులు జూను సందర్శించగా వారి వద్ద నుంచి రూ. 2.92 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.

జూడో క్రీడాకారిణికి ఆర్థిక సాయం

తగరపువలస, మార్చి 10 : జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన పాలెపు కీర్తికి చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.5,500 వేల ఆర్థిక సహాయం అందించారు. కీర్తి ఈనెల 12 నుంచి 14 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీల్లో పాల్గొనుంది. ఆమె ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసినట్టు పూర్వ విద్యార్థులు ఎన్నింటి కృష్ణ, బాసాన శ్రీను, దుర్గారావు తెలిపారు.

ఆప్తా సేవలు అభినందనీయం

ఎంవీపీ కాలనీ, మార్చి 10 : పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఉప కార వేతనాలు అందిస్తున్న అమెరికన్ తెలుగు ప్రొగ్రెసివ్ అసోసియేషన్ (ఆప్తా) సేవలు అభినందనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాల ఆడిటోరియంలో ఆప్తా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన తెలుగు వారు ఏర్పాటు చేసిన ఈ అసోసియేషన్ ఏటా పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తోందన్నారు. ఇప్పటివరకూ పది వేల మందికి రూ. 14 కోట్లు అందించినట్టు చెప్పారు. అనంతరం 54 మంది ఉత్తరాంధ్ర విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం

భీమునిపట్నం (రూరల్), మార్చి 10 : జీవీఎంసీ రెండవ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో వైసీపీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఇంతవరకు అమలు చేసిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల సూర్యనారాయణ, రాంబాబు, కొసన రమణ, మొక్క శ్రీను పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, మార్చి 10 : మధురవాడ శిల్పారామంలో వారాంతపు వినోదం కార్యక్రమాల్లో భాగంగా నగరానికి చెందిన శ్రీసాయి నాట్య భారతి అకాడమీ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. పలు కీర్తనలకు తనూజ, ప్రణికశ్రీ, హరిణి, కావ్య గుణశ్రీ, శ్రీవిద్య తదితరులు నృత్యరీతులు సమకూర్చారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24,టమాటా 17, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 268, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 24, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 16, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 26 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 105
ఫారం ధర	-- 125
విత్ స్కిన్	-- 220
స్కిన్‌లెస్	-- 230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..

వంతెన కష్టాలు

- తాటితూరులోని గోస్తనీ నదిపై కలగా మిగిలిన నిర్మాణం
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు, అధికారులు
- రాకపోకలకు ఐదు గ్రామాల ప్రజలు అవస్థలు
- వర్షాకాలంలో మరింత నరకయాతన

భీమునిపట్నం, (రూరల్), మార్చి 10 : మండలంలోని తాటితూరు వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. ఎప్పటి నుంచో స్థానికులు నదిపై వంతెన నిర్మించాలని వేడుకుంటున్నా... పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సాధారణ రోజుల్లో పరిస్థితి ఎలా ఉన్నా వర్షాకాలంలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు అవతల ఒడ్డుకు వెళ్లడానికి నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. సామేయవలస, మునివానిపాలెం, సంగివలస, పాండ్రంగి తదితర గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు నది దాటుకుని తాటితూరు వస్తుంటారు. వంతెన లేకపోవడంతో వారంతా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ఏళ్ల తరబడి పాలకులు, అధికారులు ముందుకు రాకపోవడంతో స్థానికులే మూడేళ్ల క్రితం ఇసుక బస్తాలు వేసి రాకపోకలకు తాత్కాలికంగా మార్గం ఏర్పాటు చేశారు. ఇది కేవలం నడవడానికి తప్ప వాహనాలు వెళ్లడానికి అవకాశం లేదు. అది కూడా నదిలో నీటి ప్రవాహం లేనప్పుడు మాత్రమే ఉపయోగపడుతుంది. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పరిసర గ్రామాలకు చెందిన వారు చుట్టూ తిరిగి తగరపువలస మీదగా తాటితూరు వస్తుంటారు. ఈ గ్రామం వద్ద వంతెన నిర్మించినట్లయితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తాటితూరు గ్రామానికి దూరంగా తగరపువలస సమీపంలో నగరపాలెం వద్ద నుంచి నీటిని మోటార్ల ద్వారా తీసుకువెళుతున్నందుకు దివీస్ సంస్థ తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టింది ఇది తగరపువలస సమీపంలో ఉండడం వల్ల తాటితూరు పరిసర గ్రామాల ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. ఈ చిన్న వంతెన తాటితూరు సమీపంలో నిర్మించమని ఈ ప్రాంతీయులు కోరుతుండగా తగరపువలసను ఆనుకుని ఉన్న ప్రాంతంలో నిర్మించారని అక్కడి వారు అంటున్నారు. సమీపంలో పెద్ద వంతెన ఉందని, అందువల్ల తాటితూరు వద్ద అయితే సంగివలస, వలందపేట గ్రామాల ప్రజలు పద్మనాభం వెళ్లడానికి ఈ వంతెన ఉపయోగపడుతుందని అంటున్నారు. ఆ దిశగా పాలకులు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


తాటితూరులో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్గం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం

భీమునిపట్నం, మార్చి 10 : ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లోనూ విస్తరిస్తున్నారని, మహిళలు మరింతగా చైతన్యవంతులైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. ఆదివారం తోటవీధి కల్యాణ మండపంలో ఎస్‌వోఎస్ ఫ్యామిలీ స్ట్రెన్తనింగ్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. విద్య, వైద్య, ఆరోగ్య రంగాలతో పాటు అంతరిక్ష, సైనిక విభాగాలల్లోనూ మహిళలకు ప్రాధాన్యత లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే మహిళలకు పలు పోటీలు నిర్వ హించి, బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసరి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం, ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ డైరెక్టర్ రవీంద్ర, ఎస్‌వోఎస్ ఎఫ్ఎస్‌పీ ప్రోగ్రామ్ మేనేజర్ కర్రోతు దుర్గరాజ్, సిబ్బంది లక్ష్మణ్, యానిమేటర్లు అప్పలకొండ, సరళ, అప్పలకొండ, శ్యామల, మాత, రమణి, వరలక్ష్మి, ఈశ్వరీకుమరి, ఆదిలక్ష్మి, చందక జానకి పాల్గొన్నారు.

'జగన్ మాటలు నమ్మొద్దు'

భీమునిపట్నం, మార్చి 10 : పరిపాలనా రాజధాని విశాఖ అంటూ ఇన్నాళ్లు ప్రజలను మోసగించిన జగన్ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో గెలిస్తే విశాఖ నుంచి ప్రమాణ స్వీకారం చేస్తానని మరో కొత్త నాటకం ప్రారంభించారని ఏపీ ఫిషర్ మెన్ కాంగ్రెస్ చైర్మన్ కదిరి జగన్నాథం విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఐటీ హిల్స్ నుంచి కంపెనీలు తరలిపోతున్నా.. విశాఖ ఉక్కును కేంద్రం అమ్మేస్తున్నా.. వైసీపీకి పట్టడం లేదన్నారు. విశాఖలో కొండలు, గుట్టల్ని కొల్లగొట్టడం, పోర్టులను అమ్మేయడం, భూములను కబ్జా చేయడం ఇవే వారి విజన్ అని దుయ్యబట్టారు.

పదో తరగతి పరీక్షలకు 13 కేంద్రాలు

భీమునిపట్నం, మార్చి 10 : ఈనెల 18 నుంచి ప్రారంభం గానున్న పదో తరగతి పరీక్షలకు భీమిలిలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ ఎం. శివ రాణి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బీచ్ రోడ్డులో ఉన్న పెదమంగమారిపేట హైస్కూల్, ఏపీఆర్ బాలికల స్కూల్, నెహ్రూ రోడ్డులో వున్న మునిసిపల్ హైస్కూల్, సుభాష్ రోడ్డులో వున్న పండిట్ నెహ్రూ మునిసిపల్ హైస్కూల్, భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ గర్ల్స్ హైస్కూల్, భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస కొండపేటలో వున్న బాలుర హైస్కూల్, చిట్టివలస జడ్పీ హైస్కూల్ ఫర్ గర్ల్స్, చిట్టివలస డా. బీఆర్ అంబేడ్కర్ మునిసిపల్ హైస్కూల్, జడ్పీ హైస్కూల్ ఆర్. తాళ్లవలస, శారద హైస్కూల్, సంగివలస శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఆర్. తాళ్లవలసలోని తిరుమల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను కేంద్రాలుగా ఏర్పాటు చేసామన్నారు. మొత్తం 2609 మంది పరీక్షలకు హాజరుకానున్నారని, 30వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పద్మనాభం (రూరల్), మార్చి 10 : పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన రెడ్డిపల్లి గ్రామంలో 400 మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, తహసీల్దార్ ఎస్. వెంకటరావు, ఎంపీడీవో శైలజ, వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు ఆదిబాబు, చిన్నారావు, మొకర అప్పలనాయుడు పాల్గొన్నారు.

16 నుంచి ఎల్లమ్మ తల్లి జాతర



భీమునిపట్నం, మార్చి 10 : పట్టణంలోని రెల్లివీధిలో వెలసిన ఎల్లమ్మ తల్లి జాతర ఈనెల 16, 17 తేదీల్లో జరగనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెరుపండా శేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 16న రాత్రి తొలేళ్ల ఉత్సవం, 17న అమ్మవారి అనుపోత్సవం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులకు దర్శనాలు కలుగజేస్తామన్నారు.

శరవేగంగా యాగ శాల నిర్మాణం


నిర్మాణంలో ఉన్న యాగశాల

సింహాచలం, మార్చి 10 : సింహగిరిపై ఈనెల 26 నుంచి జరిగే శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం యాగశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు కార్యనిర్వాహక ఇంజినీరు దండుగణ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో దేవాలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా యాగశాల నిర్మిస్తున్నారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సూచనల మేరకు ఆగమశాస్త్ర విధానంలో ఐదు హోమ కుండాలను, యాగశాలను, దానికి ఎదురుగా స్వామిని ఉంచేందుకు ప్రధాన వేదికను తీర్చిదిద్దుతున్నారు.

వెల్లంకిలో 'చేయూత' నమూనా చెక్కు ప్రదర్శన


నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఆనందపురం, మార్చి 10 : మండలంలోని వెల్లంకి గ్రామంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం వైఎస్సార్ చేయూత నాలుగో విడత నమూనా చెక్కు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తూ మహిళలకు పదవుల్లో 60 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే రూ. 20 లక్షలతో వెల్లంకిలో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పలనాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్‌పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, కాకర వెంకటరమణ, కార్యదర్శి బాబి పాల్గొన్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పద్మనాభం (రూరల్), మార్చి 10 : రెడ్డిపల్లిలో రామాలయం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో రూ. 1.20 కోట్లతో గ్రామస్తులు ఆల యాన్ని పునర్నిర్మిస్తున్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం

వర్ధంతి సభలో వక్తలు


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మహిళలు

మధురవాడ, మార్చి 10 : విద్యావేత్త సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు మహిళలు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సావిత్రిబాయిపూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మధురవాడ జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత ఇప్పటికీ మహిళల పట్ల కొందరు వివక్ష చూసిస్తున్నారన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా మహిళలు తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు, భోజన పథకం కార్మికులు, సీఐటీయూ నేత అప్పలరాజు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యాలయంలో...

ఎండాడ : సావిత్రిబాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని ఎండాడలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నాయకులు పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన


ఆరిలోవ : ఓటరు నమోదులో పాల్గొన్న నాయకులు


రామ్‌నగర్‌లో ఓటరు నమోదు శిబిరం

ఆరిలోవ, మార్చి 10 : జీవీఎంసీ పరిధిలోని పలు వార్డుల్లో టీడీపీ నాయకులు ఆదివారం ఓటరు నమోదు చేపట్టారు. 12వ వార్డులో పార్టీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో తోటగరువు పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు కొత్తగా ఓటు నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఒమ్మి సన్యాసిరావు,బుడుమూరు గోవింద్, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, పోతన భరత్,గణపతి పాల్గొన్నారు. అలాగే 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో వార్డు కార్యదర్శి ఆబోతులు అప్పలనాయుడు, మూది అప్పారావు, ఎం. కృష్ణంరాజు, ఆదినారాయణ, మంగరాజు, చిన్న పాల్గొన్నారు. 10 వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐజీ నగర్ రామాలయం వీధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు,కార్యదర్శి కేతా సత్యన్నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, కొండమ్మ , తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లో టీడీపీ నాయకులు ఓటరు నమోదు చేపట్టారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్‌చార్జి గాలి అప్పలరెడ్డి చైతన్యనగర్‌లో 18 ఏళ్లు నిండిన వారితో ఓటు నమోదు చేయించారు. కార్డుల్లో తప్పులున్న వారితో దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా అప్పలరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గొలగాని పురుషోత్తం, నాయకులు బూసా రాంబాబు, బూసా పోతన్నరెడ్డి, ఎర్రాజిరెడ్డి, గుడ్ల గోవింద్‌రెడ్డి, తెంటు స్వామినాయుడు, బీఎస్ఎన్ రెడ్డి,ప్రసాద్, వేణుభాయ్, రాజ్యలక్ష్మీ, నాగమణి, రమణ పాల్గొన్నారు.

9వ వార్డులో..

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డులోని విశాలాక్షినగర్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రాంతంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో ఓటరు నమోదు చేపట్టారు. 18 ఏళ్లు నిండిన వారికి కొత్త ఓటరు నమోదుతో పాటు అడ్రస్ మార్పు, ఓటు హక్కు బదిలీ వంటివి చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, అన్నె రాజా, వెంసాడ శ్రీనివాసరెడ్డి, సబ్బి శివ, పూరెడ్డి శ్రీనివాసరెడ్డి, మైలపల్లి శ్రీను, గరికిన నూకరాజు, శేసెట్టి జ్యోతి, ఈగల కొండలరావు,గరికిన శ్రీను, కొల్లేటి అప్పన్న పాల్గొన్నారు. అలానే విశాలాక్షినగర్ పోలీసు క్వార్టర్స్ ప్రాంతంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు నిర్వహించారు.

చినవాల్తేరులో...

పెదవాల్తేరు : తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు టీడీపీ 21వ వార్డు అధ్యక్షుడు పీతల అవినాష్ యాదవ్ ఆధ్వర్యంలో చినవాల్తేరు కోటక్ స్కూల్ సమీపంలోని మసీద్ వద్ద ఓటరు నమోదు చేపట్టారు. 18 ఏళ్లు నిండిన 200 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీతల అవినాష్, వినయ్, వెంకటరావు, చిన్ని, మదీనా, ఆలీ, ప్రసాద్ పాల్గొన్నారు.

28వ వార్డులో...

రామ్‌నగర్ : పిఠాపురం జంక్షన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఓటరు నమోదు శిబిరం ఏర్పాటు చేశారు. 28వ వార్డు టీడీపీ అధికార ప్రతినిధి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో వార్డులోని 195, 196, 197, 198, 207, 208 బూత్‌ల్లో శిబిరం ఏర్పాటు చేసి, ఓటరు వెరిఫికేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా అప్పలరాజు, రాము, సారిపల్లి మహేశ్, ఎం. శంకర్రావు, జోగా సన్యాసి రావు, మంగమ్మ, కనకమహాలక్ష్మీ, పల్లా అజయ్, తోటపల్లి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నంబరు 229 అమలు

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


వెలగపూడికి హారతి పడుతున్న మహిళలు

వెంకోజిపాలెం, మార్చి 10 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూ సమస్యకు సంబంధించిన జీఓ నంబరు 229ను అమలు చేస్తామని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు ఆదివారం 15 వార్డు కొత్తవెంకోజిపాలెం కొండవాలు ప్రాంతంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి టీడీపీప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన జీఓ నంబరు 229ను వైసీపీ అధికారంలోకి వచ్చాక తుంగలోకి తొక్కిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవోను అమలు చేస్తామని చెప్పారు. అనంతరం ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించి, టీడీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకుడు బొరధన రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, సీహెచ్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించండి : పట్టాభిరామ్


ఎంవీపీ కాలనీలో ప్రచారం చేస్తున్న పట్టాభిరామ్, తదితరులు

ఎంవీపీ కాలనీ, మార్చి 10 : రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎంవీపీ కాలనీ రైతుబజారులో టీడీపీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పులో వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తిబాబు, గొలగాని పోలరావు, నరేంద్ర, వాసు, దేముడుబాబు, ఈశ్వరరావు, శాంతారావు, కనక, మాలిబాబు పాల్గొన్నారు.

80 మందికి కళ్లద్దాలు పంపిణీ


కళ్లద్దాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

తగరపువలస, మార్చి 10 : చిట్టివలస బంతాట మైదానంలో ఇటీవల కంటి ఆపరేషన్లు చేయించుకున్న పలువురికి టీడీపీ నాయకులు ఆదివారం కళ్లద్దాలు పంపిణీ చేశారు.గత నెలలో ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చిట్టివలసలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈమేరకు కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి అవసరమైన కళ్లద్దాలను ట్రస్టు సభ్యులు పంపించగా పార్టీ నాయకులు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ట సురేష్, రెండో వార్డు అధ్యక్షుడు బి. నీలకంఠం, నరవ రామారావు, తాటిపూడి అప్పలరాజు, పిల్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాగర్‌నగర్, మార్చి 10 : జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని జిమ్‌సర్ ఆసుపత్రి ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన కల్పించారు. గీతంలోని సెక్యూరిటీ సిబ్బందితో పాటు భోజన శాలలు, నర్సింగ్ సేవల విభాగం సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రముఖ భద్రతా నిపుణుడు డాక్టర్ ఎస్‌పీటీ రంగాచార్యులు సూచనలు ఇచ్చారు. అలాగే ఎల్‌పీజీ ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. రామాంజనేయులు, సెక్యూరిటీ విభాగం అధికారులు నాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

భైరవస్వామికి అమావాస్య పూజలు


భైరవస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం, మార్చి 10 : అడవివరంలోని భైరవస్వామికి మాఘమాస అమావాస్య పురస్కరించుకుని భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున మూడు గంటల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివ చ్చారు. కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాల అనంతరం భైరవవాక చేరుకుని అమృత కలశాలను మొక్కుబడిగా సమర్పించడంతో పాటు క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేసి వడమాలలు స్వామిమెడలో వేశారు.

మహిళలకు యోగా ఎంతో అవసరం

సిరిపురం, మార్చి 10 : మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండడం వల్ల మరింత శక్తిగా పని చేసేందుకు అవకాశం కలుగుతుందని వసుంధర డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ టి. శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం సిరిపురంలోని ఫ్యూజన్ ఫుడ్స్ ఆవరణలో వసుంధర డైమండ్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని యోగసనాల శిబిరం (ఎంకరేజ్ ద ఆర్ట్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం కోసం తప్పనిసరిగా యోగాసనాలు వేయాలన్నారు. అనంతరం గాయని ఇంద్రగంటి వెంకట రమణిప్రసాద్, వేణువు కులపతి ఇంద్రగంటి కాశీప్రసాద్ దంపతులతో పాటు అప్పలరాజును ఘనంగా సన్మానించారు.